E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

(తేదీ) 07-05-2025 (వారం) బుధవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



ఉద్రిక్తతల వేళ.. పాక్ సరిహద్దులో 'వాయుసేన' భారీ విన్యాసాలు!

» 2లో

ఉత్కంఠ పోరులో ముంబయిపై గుజరాత్ విజయం

» 6లో




ఏఐ వినియోగంలో దూసుకెళ్తున్న భారత్: కేపీఎంజీ రిపోర్ట్

» 4లో




గుడ్ న్యూస్ చెప్పిన వరుణ్ తేజ్ లావణ్యత్రిపాఠి

» 5లో



క్షిపణి దాడి.. మే 8 వరకు విమానాల నిలిపివేత

» 4లో



# "గచ్చిబౌలిలో "సంధ్య' అక్రమ సామ్రాజ్యం నేలమట్టం"

**అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలను కూల్చివేసిన హైడ్రా**

**సంధ్య మినీ కన్వెన్షన్ సెంటర్, ఫుడ్ కోర్టులు, వంట గదులు, షెడ్లు కూల్చివేత**

**సంధ్య అక్రమాలను ఐదు నెలల క్రితమే వెలుగులోకి తెచ్చిన 'ఈ-కబురు'**





సంధ్య కన్వెన్షన్ బోర్డును కూల్చివేస్తున్న దృశ్యం

ఈకబురు, శేరిలింగంపల్లి : గచ్చిబౌలిలో అక్రమ నిర్మాణాల పునాదులపై నిర్మించిన సంధ్య సామ్రాజ్యం దాదాపు నేలమట్టమైంది. పార్కులను చేరబట్టి.. రహదారులను కనుమరుగుజేసి చేపట్టిన అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు మంగళవారం కూల్చివేశారు. గచ్చిబౌలి నడిబొడ్డున కొనసాగుతున్న సంధ్య అక్రమ నిర్మాణాలపై స్థానిక జిహెచ్ఎంసి అధికారులు ప్రేక్షక పాత్ర వహించడంతో పలువురు ప్లాట్ల యజమానులు హైడ్రాను ఆశ్రయించారు. ఫిర్యాదులపై స్పందించిన హైడ్రా అధికారులు సర్వే నిర్వహించి అక్రమ నిర్మాణాలను గుర్తించారు. ఈ మేరకు భారీ యంత్రాంగం మధ్య మంగళవారం ఉదయం నుంచి కూల్చివేతలు చేపట్టారు. అనుమతి లేకుండా చేపట్టిన వ్యాపార సముదాయాలు, ఫుడ్ కోర్టులు, సంధ్య మినీ కన్వెన్షన్ హాల్, నిర్మాణంలో ఉన్న షెడ్లను నేలమట్టం చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శేరిలింగంపల్లి మండల పరిధిలోని గచ్చిబౌలి సర్వే నెంబరు 124,125లలో ఉన్న 18 ఎకరాల విస్తీర్ణంలో పర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ లే అవుట్ ఉంది. మొత్తం 162 ప్లాట్లు ఉన్న ఈ లే ఔట్ లో చాలా వరకు సంధ్య నిర్మాణ సంస్థ చేజిక్కించుకుంది. ఈ లేఅవుట్ పై ఎన్నో వివాదాలు నడుస్తుండగా, పలు వివాదాలు కోర్టుల్లో, అర్బన్ ల్యాండ్ సీలింగ్, ఇన్కమ్ టాక్స్, ఎన్ ఫోర్సుమెంటు డైరెక్టరేట్ పరిధిలో ఉన్నాయి.



ఈ-కబురు

నాడు అక్రమం...

నేడు సక్రమం..

ఐదు నెలల క్రితం ఈ-కబురు ప్రచురించిన కథనం

## ఐదు నెలల క్రితమే వెలుగులోకి తెచ్చిన ఈ-కబురు...

గచ్చిబౌలి ఎఫ్ సిఐ లే అవుట్ లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను ఈ కబురు దినపత్రిక 5 నెలల క్రితమే వెలుగులోకి తీసుకువచ్చింది. యుఎల్సీ భూముల్లో రహదారులు, పార్కులను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారంటూ గత సంవత్సరం డిసెంబర్ 3వ తేదీన కథనాన్ని ప్రచురించింది. నాడు జిహెచ్ఎంసి అధికారులు కేవలం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి, నిర్మాణదారులకు వంత పాడుతూ, చర్యలు తీసుకోకుండా కాలయాపన చేయడంతో ప్లాట్ల యజమానులు హైడ్రాను ఆశ్రయించారు. జిహెచ్ఎంసి నుంచి ఎటువంటి అనుమతి లేకుండా ఓ కన్వెన్షన్ సెంటర్ కొనసాగుతుందంటే అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తరువాయి 2లో



సంధ్య మినీ కన్వెన్షన్ సెంటర్ ను కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు



అక్రమంగా చేపట్టిన భారీ షెడ్లు నేలమట్టం



## 50 ఏళ్ల అవసరాల మేరకు రహదారుల నిర్మాణం

**రాబోయే 50 ఏళ్ల అవసరాలకు తగ్గట్టుగా రీజినల్ రింగ్‌రోడ్డు, రేడియల్‌రోడ్లు, ఇతర రహదారులను నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు.**

**ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్ల పనులు వేగవంతం చేయాలి**

**ఆర్అండ్‌బీ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం**

సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. పక్కన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఈ కబురు, హైదరాబాద్: రాబోయే 50 ఏళ్ల అవసరాలకు తగ్గట్టుగా రీజినల్ రింగ్‌రోడ్డు, రేడియల్‌రోడ్లు, ఇతర రహదారులను నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఆయా రహదారులకు సంబంధించిన కూడళ్లు, అనుసంధాన రోడ్లు అందుకు అనుగుణంగా ఉండాలన్నారు. ఆర్అండ్‌బీ శాఖపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి సీఎం తన నివాసంలో మంగళవారం రాత్రి సమీక్ష నిర్వహించారు. ఆర్ఆర్ఆర్ (సౌత్)కు సంబంధించిన ఎలైన్‌మెంట్‌ను పరిశీలించిన అనంతరం పలు మార్పులు చేపట్టాలని పేర్కొన్నారు. .

తరువాయి 2లో



## మా నీళ్లు మాకే.. ఎవరికీ ఇచ్చేది లేదు.. పాక్‌కు సింధు జలాల నిలిపివేతపై స్పందించిన ప్రధాని మోడీ

**మా నీళ్లు మాకే.. ఎవరికీ ఇచ్చేది లేదు.. పాక్‌కు సింధు జలాల నిలిపివేతపై స్పందించిన ప్రధాని మోడీ**

ఈ కబురు: పాకిస్తాన్‌కు సింధు నది జలాల నిలిపివేతలపై ప్రధాని నరేంద్ర మోడీ తొలిసారి స్పందించారు. మంగళవారం ఓ న్యూస్ ఛానల్ ప్రతినిధితో ప్రధాని మాట్లాడుతూ.. గతంలో భారత జలాలు బయటి దేశాలకు వెళ్లేవి.. ఇప్పుడు మన దేశంలో ప్రవహించే నీరంతా మన దేశంలోనే ఉంటాయి.. మన అవసరాలకే వాడుకుందామని పాకిస్తాన్‌ను ఉద్దేశించి పరోక్షంగా మాట్లాడారు. మన దేశంలోని జలాలను దేశీయ అవసరాలకే వినియోగిస్తామని ప్రకటించారు. 'మన దేశం మన నీళ్లు మన హక్కు' అని నినదించారు.

» 2లో


## అసలు ఏమిటీ మాక్ డ్రిల్స్.. 1971లో ఎలా జరిగాయి..?



ఈ కబురు: భారత్‌పాక్ మధ్య ఉద్రిక్తతలు తారా స్థాయికి చేరడంతో కేంద్ర హోం శాఖ సంక్షోభ సమయంలో పౌరులు ప్రాణాలు ఎలా కాపాడుకోవాలో అవగాహన కల్పించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో భాగంగా రేపు దేశవ్యాప్తంగా 259 లొకేషన్లలో మాక్ డ్రిల్స్ జరగనున్నాయి. దాదాపు 50 సంవత్సరాల తర్వాత దేశ వ్యాప్తంగా మాక్ డ్రిల్స్ చేపట్టడం గమనార్హం. కార్గిల్ యుద్ధం అప్పుడు జరిగినా.. అవి సరిహద్దు జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్ వంటి సరిహద్దు రాష్ట్రాలకే పరిమితం అయ్యాయి. ఈ సారి మాత్రం దేశవ్యాప్తంగా కీలక ప్రదేశాల్లో వీటిని నిర్వహిస్తున్నారు. 1971లో తూర్పు పాకిస్థాన్(ప్రస్తుత బంగ్లాదేశ్), పశ్చిమ పాకిస్థాన్‌లో పోరాడాల్సి రావడంతో దేశ వ్యాప్తంగా ప్రజలను అప్రమత్తం చేశారు. అంతకు ముందు 1962, 65 యుద్ధాల సమయంలో కూడా నిర్వహించారు. 1971లో మాక్ డ్రిల్స్ అనుభవాన్ని సీనియర్ జర్నలిస్టు మధురేంద్ర ప్రసాద్ సిన్హా ఓ మీడియా సంస్థతో పంచుకొన్నారు. యుద్ధానికి సరిగ్గా రెండు నుంచి నాలుగు రోజుల ముందు ఈ డ్రిల్స్ మొదలుపెట్టారని.. తూర్పు పాకిస్థాన్‌లో లెఫ్టినెంట్ జనరల్ ఏఏకే నియాజీ ఢాకాలో లొంగుబాటు పత్రంపై సంతకం చేసే వరకు వీటిని కొనసాగించారన్నారు. నాడు రాత్రి 6.30 కల్లా ప్రతి ఒక్కరూ ఇళ్లకు చేరుకొనేవారన్నారు. సైరన్ వినిపించగానే ప్రతి ఒక్కరూలైట్లు ఆర్పేసి.. ఇంట్లో సురక్షిత స్థానాల్లో దాక్కొనేవారమని పేర్కొన్నారు. ఆ సమయాల్లో పెద్దగా మాట్లాడటం కూడా చేసేవారు కాదు. ఆర్కే శర్మ అనే రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి తన అనుభవాలు చెబుతూ.. నాడు సైరన్ వినిపించగానే నేలపై పడుకొని.. చెవులు గట్టిగా మూసుకొనేవారమన్నారు.

» 3లో

## ఉగ్రదాడిపై సమాచారమున్నా.. ఎందుకు భద్రత కల్పించలేదు..? ఖర్గే



**ఉగ్రదాడి గురించి ఇంటెలిజెన్స్ సమాచారంతోనే కశ్మీర్ పర్యటనను ప్రధాని మోదీ రద్దు చేసుకున్నారని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు.**

ఈ కబురు: పహల్గాం ఉగ్రదాడి వ్యవహారానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆరోపణలు చేశారు. పహల్గాంలో మరింత భద్రత ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు.

» 2లో

## పన్నెండున్నరేళ్ల క్రితం కన్నీళ్లతో కోర్టు మెట్లు ఎక్కా: సబితా ఇంద్రారెడ్డి



**ఓబుళాపురం మైనింగ్ కేసులో తనను సీబీఐ కోర్టు నిర్దోషిగా ప్రకటించడంపై మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.**

ఈకబురు, హైదరాబాద్: ఓబుళాపురం మైనింగ్ కేసులో తనను సీబీఐ కోర్టు నిర్దోషిగా ప్రకటించడంపై మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

» 2లో

## ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు తుది తీర్పు వెలువరించింది.

ఈ కబురు, హైదరాబాద్: ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు తుది తీర్పు వెలువరించింది. 15 ఏళ్ల పాటు సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో మొత్తం ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన గాలి జనార్దన్ రెడ్డి, బీవీ శ్రీనివాసరెడ్డి, మెఫజ్ అలీఖాన్, గనుల శాఖ అప్పటి డైరెక్టర్ వీడీ రాజగోపాల్‌ను దోషులుగా నిర్ధారిస్తూ శిక్షలు ఖరారు చేసింది. గాలి జనార్దన్‌రెడ్డి సహా నలుగురికి ఏడేళ్ల పాటు జైలు శిక్ష ఖరారు చేసింది. అలాగే, దోషులకు రూ.



» 2లో

## సీఎం రేవంత్ కుటుంబం పై కేటీఆర్ సంచలన ఆరోపణలు

ఈ కబురు: సీఎం రేవంత్ రెడ్డి , అతని కుటుంబ సభ్యులపై మాజీ మంత్రి కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ రోజు తెలంగాణ భవన్ లో రాష్ట్ర పరిస్థితులపై సీఎం చేసిన వ్యాఖ్యలపై ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రం దివాలా తీసిందని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారు. అందాల పోటీలకు 250 కోట్లు పెట్టడానికి డబ్బులు ఉన్నాయి కానీ.. రిటైర్ అయిన ఉద్యోగులకు ఇవ్వడానికి డబ్బులు లేవా అని ప్రశ్నించారు. అలాగే ఓ పక్క రాష్ట్రం దివాళా తీస్తుంటే సీఎం రేవంత్ రెడ్డి కుటుంబం మాత్రం వేల కోట్లు సంపాదిస్తుందని కేటీఆర్ ఆరోపించారు. ఫోర్త్ సిటీ లో సీఎం రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు 2000 ఎకరాలు కొన్నారని వాటిని ఎలా కొన్నారని ఈ సందర్భంగా ప్రశ్నించారు. అలాగే సీఎం అన్నదమ్ములు, బామ్మర్ది, కుటుంబ సభ్యులు అందరి ఆదాయం భారీగా పెరిగింది.. కానీ రాష్ట్ర ఆదాయం ఎందుకు పెరగలేదని కేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్రం దివాలా తీసిందని చెబుతూ. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు రూ.200లకు పెంచి.. రాష్ట్ర సంపద పెంచాలని అనుకుంటున్నాడని ఈ సందర్భంగా కేటీఆర్ ఆరోపించారు.



» 2లో

## తెలంగాణలో ఆర్టీసీ సమ్మె వాయిదా

» 2లో

**తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు తలపెట్టిన సమ్మె వాయిదా పడింది.**

ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు తలపెట్టిన సమ్మె వాయిదా పడింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఆర్టీసీ జేఏసీ నేతలు జరిపిన చర్చలు సఫలం కావడంతో సమ్మె వాయిదా పడింది. ఉద్యోగుల సమస్యలపై ముగ్గురు ఐఏఎస్ అధికారులతో ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. నవీన్ మిత్తల్, లోకేశ్ కుమార్, కృష్ణభాస్కర్‌లతో కూడిన ఈ కమిటీ ఉద్యోగ సంఘాలతో చర్చించి సమస్యలకు పరిష్కారాలను సూచించనుంది. వారం రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఈ కమిటీని ప్రభుత్వం ఆదేశించింది. డిపోల్లో ఏయే సమస్యలు ఉన్నాయి? ఉద్యోగులు, కార్మికుల పని భారం, ఒత్తిళ్లు వంటి అంశాలకు పరిష్కారం ఏమిటనే అంశాలపై జేఏసీ నేతలతో మంత్రి చర్చించారు.



మొదటి పేజీ తరువాయి

# 50 ఏళ్ల అవసరాల మేరకు రహదారుల నిర్మాణం



అలాగే హైదరాబాద్‌శ్రీశైలం జాతీయ రహదారిలో ఎలివేటెడ్ కారిడార్ నూతన ఎలైన్‌మెంట్‌కు సంబంధించి సూచనలు చేశారు. సీఎం మాట్లాడుతూ.. అటవీప్రాంతం, జలవనరులు, మండలకేంద్రాలు, గ్రామాల విషయంలో ముందుగానే లైడార్ సర్వే చేపట్టాలని ఆదేశించారు. ఎలైన్‌మెంట్ విషయంలో అనవసర అపోహలకు, పొరపాట్లకు తావివ్వరాదన్నారు. శాటిలైట్ టౌన్‌షిప్‌లు, పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు అనుగుణంగానే రేడియల్ రోడ్ల నిర్మాణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు రేడియల్ రోడ్లు నిర్మాణ పనుల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. హైదరాబాద్ మీదుగా వెళ్లే జాతీయ, రాష్ట్ర రహదారులు ఆర్ఆర్ఆర్ వెలుపలికి వెళ్లే ప్రాంతంలో ట్రంపెట్స్ నిర్మించాలన్నారు. రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా ఓఆర్ఆర్ నుంచి మంచిర్యాల వరకు నూతన రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రత్యామ్నాయ ఎలైన్‌మెంట్‌ను వీలైనంత తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ మార్గంలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు గల అనుకూలతలను పరిశీలించి నివేదిక రూపొందించాలన్నారు. నూతన రహదారులకు సంబంధించి జాతీయ రహదారులశాఖ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, ఆర్‌అండ్‌బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రత్యేక కార్యదర్శి హరిచందన, పురపాలకశాఖ కార్యదర్శి ఇలంబర్తి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పరిశ్రమలు, పెట్టుబడుల విభాగం అదనపు సీఈవో నరసింహారెడ్డి, జాతీయ రహదారుల విభాగం ప్రాంతీయ అధికారి శివశంకర్ పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# గచ్చిబౌలిలో "సంధ్య' అక్రమ సామ్రాజ్యం నేలమట్టం



సంధ్య మినీ కన్వెన్షన్ సెంటర్ ను కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు

గచ్చిబౌలిలోని డీఎల్ఎఫ్ పక్కనే.. ట్రిపుల్ ఐటి చౌరస్తాకు ఆనుకొని ఉన్న ఈ సర్వే నెంబర్లలో యధేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఐటి కారిడార్ నడిబొడ్డున జీహెచ్ఎంసీ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా, ఎఫ్ సీఐ లేఅవుట్ నిబంధనలకు విరుద్ధంగా భారీ ఫుడ్ కోర్టులు, డ్రైవ్ ఇన్ లు చేపడుతున్నారు. లే ఔట్ లో ఉన్న అంతర్గత రహదారులను ఆక్రమించి, పార్కులను కబ్జా చేసి భారీ వ్యాపార సముదాయాలు వెలుస్తున్నాయి. రహదారులు, ప్లాట్లను ఆక్రమించి, దారి మూసివేసి నిర్మాణాలు చేపడుతున్నారని ప్లాట్ల యజమానులు స్థానిక జిహెచ్ఎంసి అధికారులకు ఫిర్యాదులు చేసినా వారి నుండి స్పందన లేకపోయింది. దీంతో పలువురు ప్లాట్ల యజమానులు హైడ్రాను ఆశ్రయించారు.

**హైడ్రా ఆధ్వర్యంలో కూల్చివేతలు...**

ప్లాట్ల యజమానుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ఎఫ్ సీఐ లే ఔట్ లో పూర్తి సర్వే నిర్వహించారు. ఈ లేఔట్ లో చేపట్టిన 90 శాతం నిర్మాణాలకు అనుమతులు లేవని గుర్తించారు. ఈ మేరకు మంగళవారం ఉదయం భారీ పోలీసు బందోబస్తు, యంత్రాంగం మధ్య అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేపట్టారు. అనుమతి లేకుండా చేపట్టిన సంధ్య మినీ కన్వెన్షన్ హాల్ వంట గదులు ఫుడ్ కోర్టులు పలు వ్యాపారాల షెడ్లను జేసీబీలతో నేలమట్టం చేశారు. ఈ లేఔట్ లో కొనసాగుతున్న యునోస్ ఫుడ్ కోర్టుకు సైతం అనుమతి లేదని... కోర్టు స్టే ఉన్న కారణంగా కూల్చివేతలు చేపట్టలేదని అధికారులు తెలిపారు.

**జిహెచ్ఎంసి అధికారుల ప్రేక్షక పాత్ర...**

గచ్చిబౌలి ఐటీ కారిడార్ నడిబొడ్డున ఇంతటి అక్రమ సామ్రాజ్యం నిర్మితమవుతున్నా జిహెచ్ఎంసి అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తుంది. ఎటువంటి వాణిజ్య నిర్మాణ అనుమతులు లేని లేఅవుట్ లో భారీ ఎత్తున అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఇన్ని రోజులపాటు కళ్లప్పగించి చూస్తుండిపోయారు. ప్లాట్ల యజమానులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా జిహెచ్ఎంసి అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో వారు చివరికి హైడ్రాను ఆశ్రయించారు. పేదోడు చిన్న ఇంటి నిర్మాణం చేపడితేనే అనుమతి పేరుతో నానా హడావిడి చేసే జిహెచ్ఎంసి అధికారులకు.. ప్రధాన రహదారిపై అనుమతి లేకుండా చేపట్టిన భారీ వాణిజ్య సముదాయాలు కళ్ళకు కనిపించకపోవడం శోచనీయం.

మొదటి పేజీ తరువాయి

## మా నీళ్లు మాకే.. ఎవరికీ ఇచ్చేది లేదు.. పాక్‌కు సింధు జలాల నిలిపివేతపై స్పందించిన ప్రధాని మోడీ



ఇప్పుడు మన దేశంలో ప్రవహించే నీరంతా మన దేశంలోనే ఉంటాయి.. మన అవసరాలకే వాడుకుందామని పాకిస్తాన్‌ను ఉద్దేశించి పరోక్షంగా మాట్లాడారు. మన దేశంలోని జలాలను దేశీయ అవసరాలకే వినియోగిస్తామని ప్రకటించారు. 'మన దేశం మన నీళ్లు మన హక్కు' అని నినదించారు. కాగా, జమ్మూకశ్మీర్‌లోని పెహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్, పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకుంది. ఉగ్రదాడికి పాకిస్తానే కారణమని నిర్ధారించిన కేంద్రం..పాక్‌పై ఆంక్షలు విధించింది. పాకిస్తాన్ సైతం భారత్‌తో ఆర్థిక సంబంధాలతో పాటు అన్ని బంధాలను తెంచుకున్నది. ఈ క్రమంలోనే పాకిస్తాన్‌తో 1960లో కుదిరిన సింధు నదీ జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని భారత్ నిర్ణయించింది. ప్రధాని మోడీ అధ్యక్షతన ఏప్రిల్ 23న జరిగిన కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ (సీసీఎస్) సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 'సింధు నదీ జలాల ఒప్పందం తక్షణమే నిలిపివేస్తున్నాం. సీమాంతర ఉగ్రవాదానికి పాకిస్తాన్ మద్దతు ఇవ్వడం ఆపే వరకు ఈ తాత్కాలిక నిషేధం అమలులో ఉంటుందని విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ చెప్పారు.

# సీఎం రేవంత్ కుటుంబం పై కేటీఆర్ సంచలన ఆరోపణలు



సీఎం రేవంత్ రెడ్డిరాష్ట్ర పరిస్థితిపై చేసిన వ్యాఖ్యలపై పెద్ద దుమారం మొదలైంది. సోమవారం ఉద్యోగ సంఘాల అంశంపై ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని.. అణా పైసా అప్పు పుట్టడం లేదని.. అప్పుల కోసం బ్యాంకుల వద్దకు వెళితే దొంగలను చూసినట్లు చూస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇలా చెబితే ఎవరూ నమ్మడం లేదు.. కానీ పరిస్థితి మాత్రం అత్యంత దారుణంగా ఉందని అన్నారు. స్వీయ నియంత్రణ మాత్రమే దీనికి సరైన పరిష్కారం అని అన్నారు. కాగా సోమవారం సీఎం చేసిన ఈ వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అబద్ధాలు చెబుతూనే ఉన్నారని, మొదటి వారంలో శ్వేత పత్రం తో మొదలైన రేవంత్ అబద్ధాల పరంపర నేటికీ కొనసాగుతూనే ఉందని అన్నారు. అలాగే అప్పుల కోసం వెళితే తమను దొంగలను చూసినట్లు చూస్తున్నారని చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ కౌంటర్ ఇస్తూ.. ఎక్కడైనా దొంగను దొంగే అంటారని, దొంగ అని తెలిసినా కూడా పార్టీలోకి తీసుకొని ఓ దొంగను సీఎం చేసిన దిక్కుమాలిన పార్టీ కాంగ్రెస్ అని కేటీఆర్ తీవ్ర స్థాయి విమర్శలు చేశారు. అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పరిస్థితులపై మాజీ మంత్రి కేటీఆర్ క్లారిటీ ఇచ్చారు.

మొదటి పేజీ తరువాయి


## ఉగ్రదాడిపై సమాచారమున్నా.. ఎందుకు భద్రత కల్పించలేదు..? ఖర్గే



**'సంవిధాన్ బచావో' పేరుతో రాంచీ వేదికగా నిర్వహించిన సభలో ఖర్గే ఈ విధంగా స్పందించారు.**

"దేశంలో పరిస్థితుల గురించి మీ అందరికీ తెలుసు. పహల్గాం ఉగ్రదాడి ఘటనకు సంబంధించి నిఘా వైఫల్యం ఉందని ప్రభుత్వం అంగీకరించింది. ఇంటెలిజెన్స్‌ను పటిష్ఠ పరచుకుంటామని వాళ్లే చెప్పారు. దాడికి మూడు రోజుల ముందే నిఘా సమాచారం ఉందని నాకు తెలిసింది. అలాంటప్పుడు అక్కడ (పహల్గాంలో) తగినంత భద్రతా ఏర్పాట్లు ఎందుకు చేయలేదని ప్రశ్నిస్తున్నా " అని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ఏదేమైనా పహల్గాం దాడికి వ్యతిరేకంగా పాకిస్థాన్‌పై ఎటువంటి చర్య తీసుకున్నా ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతుగా నిలుస్తుందని మల్లికార్జున ఖర్గే మరోసారి స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా దేశమే తొలి ప్రాధాన్యమన్నారు. రాజకీయ విభేదాలకంటే జాతీయ ఐక్యతే ముఖ్యమన్నారు. ఇక కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేసిన ఖర్గే.. ప్రభుత్వరంగ సంస్థలను మూసివేయడమే మోదీ విధానమని ఆరోపించారు. ఆదివాసీ నేతలను భయపెట్టే ధోరణిని అవలంబించకూడదని కేంద్రానికి సూచించారు.

# ఓబుళాపురం మైనింగ్ కేసు.. గాలి జనార్దన్‌రెడ్డికి ఏడేళ్లు జైలుశిక్ష



10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఓబుళాపురం మైనింగ్ కంపెనీకు రూ.2 లక్షలు జరిమానా విధించింది. ఈ కేసులో అప్పటి గనుల శాఖ మంత్రిగా ఉన్న సబితా ఇంద్రారెడ్డికి ఉపశమనం లభించింది. ఆమెతో పాటు అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందంను సీబీఐ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. వీడీ రాజగోపాల్‌కు అదనంగా మరో నాలుగేళ్లు జైలు శిక్ష ఈ కేసులో వీడీ రాజగోపాల్‌కు అదనంగా మరో నాలుగేళ్లు జైలు శిక్ష విధించింది. భూగర్భ గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్నందున అవినీతి నిరోధక చట్టం కింద ఆయనకు అదనపు శిక్షను ఖరారు చేసింది. ప్రభుత్వ అధికారిగా ఉంటూ అక్రమాలకు పాల్పడినందున మొత్తంగా 11 ఏళ్ల పాటు అతడికి జైలు శిక్ష పడింది. దీంతో గాలి జనార్దన్ రెడ్డితో సహా మిగతా దోషులను కాసేపట్లో చంచల్‌గూడ జైలుకు తరలించనున్నట్లు సమాచారం. ఓఎంసీ కేసులో కొన్ని ముఖ్యాంశాలు.. 2007 జూన్ 18న ఓఎంసీకి లీజులు కేటాయిస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్దేశపూర్వకంగానే 'క్యాప్టివ్' అనే పదాన్ని తొలగించారని, తద్వారా అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై 2009లో డిసెంబర్ 7న తొలిసారి సీబీఐ కేసు నమోదు చేసింది. ఆ తర్వాత తెలంగాణ హైకోర్టులో స్టే రావడం, మళ్లీ డివిజన్ బెంచ్ స్టే ఎత్తివేయడం.. ఇలా పలు రకాల పిటిషన్లు వేయడంతో దాదాపు 15 ఏళ్ల పాటు విచారణ కొనసాగింది. ఐదేళ్లు దర్యాప్తునకే సమయం పట్టింది. 2009 నుంచి 2014 వరకు సీబీఐ నాలుగు ఛార్జిషీట్‌లను దాఖలు చేసింది. ఓఎంసీ వ్యవహారంలో 2011లో ఛార్జిషీట్‌ను తొలిసారి వేయగా.. 2014లో తుది ఛార్జిషీట్ తర్వాత సుదీర్ఘంగా విచారణ జరిగింది. 219 మంది సాక్షులను విచారించింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా పలు సాక్ష్యాలు, ఆధారాలను సీబీఐ సేకరించింది.

అనంతపురంలోని ఓబుళాపురంలో గనుల కేటాయింపు, తవ్వకాలకు సంబంధించి అత్యాధునిక పరికరాలతో సీబీఐ ఆధారాలు సేకరించింది. అక్రమంగా తవ్వకాలు, రవాణా, ఎగుమతులు, విక్రయాల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు సీబీఐ గుర్తించింది. ఏపీ, కర్ణాటక సరిహద్దుల్లో పెద్ద ఎత్తున తవ్వకాలు చేపట్టినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై పూర్తి ఆధారాలు, సాక్ష్యాల సేకరణతో 2014లో తుది ఛార్జిషీట్ దాఖలైంది. విదేశాలకు అక్రమంగా దాదాపు 60 లక్షల మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజాన్ని ఎగుమతి చేశారని, అక్రమ బినామీ లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని సీబీఐ ఛార్జిషీట్‌లో పేర్కొంది. ఈ కేసు విచారణలో మొత్తంగా 3337 డాక్యుమెంట్లను పరిశీలించారు. ప్రభుత్వం కేటాయించిన 68 హెక్టార్లలో కాకుండా పెద్ద ఎత్తున మైనింగ్ చేపట్టినట్లు సీబీఐ గుర్తించింది. తాజాగా ఈ కేసులో ఏ1 బీవీ శ్రీనివాసరెడ్డి, ఏ2 గాలి జనార్దన్ రెడ్డి, ఏ3 వీడీ రాజగోపాల్, ఏ4 ఓఎంసీ కంపెనీ, ఏ7 కె. మెఫజ్ అలీఖాన్‌లను దోషులుగా తేల్చిన కోర్టు.. ఏ8 కృపానందం, ఏ9 సబితా ఇంద్రారెడ్డిలను నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో విచారణ దశలోనే ఏ5 లింగారెడ్డి మృతి చెందగా.. ఏ6 శ్రీలక్ష్మిని 2022లో ఈ కేసు నుంచి తెలంగాణ హైకోర్టు డిశ్చార్జి చేసింది.

# ఉద్రిక్తతల వేళ.. పాక్ సరిహద్దులో 'వాయుసేన' భారీ విన్యాసాలు!



**దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్స్ చేపడుతున్న వేళ రాజస్థాన్‌లోని అంతర్జాతీయ సరిహద్దులో భారత వాయుసేన కూడా విన్యాసాలు చేసేందుకు సిద్ధమైంది.**

ఈ కబురు: భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ.. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సూచన మేరకు సంక్షోభ సమయంలో పౌరులు వ్యవహరించాల్సిన తీరుపై దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్స్ చేపట్టనున్నారు. ఇదే సమయంలో భారత వాయుసేన కూడా రాజస్థాన్‌లోని అంతర్జాతీయ సరిహద్దులో భారీ స్థాయిలో విన్యాసాలు చేసేందుకు సిద్ధమైంది. ఇందుకు సంబంధించి ఆయా విభాగాలకు సమాచారాన్ని వాయుసేన జారీ చేసింది. భారత్‌పాకిస్థాన్ సరిహద్దులో భారత వాయుసేన బుధవారం మాక్ డ్రిల్స్ మొదలుపెట్టనుంది. ఇందులో రఫేల్, మిరాజ్ 2000, సుఖోయ్ 30 వంటి అన్ని రకాల యుద్ధవిమానాలు పాల్గొననున్నట్లు వాయుసేన అధికారులు వెల్లడించారు. దాదాపు ఐదున్నర గంటలపాటు ఇవి కొనసాగే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీంతో సరిహద్దు ఎయిర్‌పోర్టుల్లో విమానాల రాకపోకలు పూర్తిగా నిలిపివేయనున్నారు. మరోవైపు శత్రుదేశం దాడులు చేస్తే సురక్షితంగా ప్రాణాలు కాపాడుకోవడంపై అవగాహన కల్పించేందుకు సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా దాదాపు 300 ప్రాంతాలను ఎంపిక చేశారు. వైమానిక దాడులు, బాంబు దాడులు జరిగితే ఎలా రక్షించుకోవాలో ప్రజలు, విద్యార్థులకు తెలియజేయనున్నారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు చేపట్టాల్సిన చర్యలపై కేంద్ర మార్గదర్శకాలను అనుసరించి ఈ డ్రిల్స్ చేపడతారు.

# తెలంగాణలో ఆర్టీసీ సమ్మె వాయిదా




తాత్కాలిక వాయిదా మాత్రమే.. జేఏసీ నేతలు దాదాపు మూడు గంటల పాటు కొనసాగిన ఈ చర్చల్లో ఆర్టీసీ విలీనం అంశంపైనా సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. ఈ చర్చల అనంతరం ఆర్టీసీ జేఏసీ నేతలు మీడియాతో మాట్లాడుతూ.. "ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరాం. ప్రైవేటు విద్యుత్తు బస్సుల గురించి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ప్రభుత్వమే విద్యుత్తు బస్సులు కొని ఆర్టీసీకి ఇచ్చేలా చర్యలు చేపడతామని మంత్రి అన్నారు. కారుణ్య నియామకాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. సింగరేణి మాదిరిగా రెగ్యులర్ ప్రాతిపదికన కారుణ్య నియామకాలు చేపట్టాలని మేం కోరాం. విశ్రాంత ఉద్యోగుల బకాయిలు, వేతన సవరణ గురించి సానుకూలంగా స్పందించారు. మా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి కొంత సమయం ఇచ్చేలా, దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సమ్మెను కొంత కాలం పాటు వాయిదా వేయాలని నిర్ణయించుకున్నాం. మా సమస్యల్ని పరిష్కరించకపోతే కచ్చితంగా మళ్లీ సమ్మె తేదీని ప్రకటిస్తాం. ఇది తాత్కాలిక వాయిదా మాత్రమే" అని జేఏసీ నేతలు స్పష్టం చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేయాలని ఇటీవల టీజీఎస్‌ఆర్టీసీ ఐకాస నేతలు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి వరకు చర్చలకు ఆహ్వానం రాకపోతే.. మే 7వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని ప్రకటించారు. ఈ క్రమంలోనే సోమవారం భారీ కవాతు సైతం నిర్వహించారు. ఈ క్రమంలో తాజాగా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో జరిపిన చర్చలు సఫలం కావడంతో సమ్మెను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

## తెలంగాణలో ప్రభుత్వాన్ని నడపలేని స్థితిలో కాంగ్రెస్: కేంద్రమంత్రి బండి సంజయ్

**రాష్ట్రానికి పెద్దగా భావించే ముఖ్యమంత్రే రాష్ట్రం దివాలా తీసిందని పేర్కొనడం సిగ్గుచేటని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు.**

ఈ కబురు,కరీంనగర్: రాష్ట్రానికి పెద్దగా భావించే ముఖ్యమంత్రే రాష్ట్రం దివాలా తీసిందని పేర్కొనడం సిగ్గుచేటని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ప్రభుత్వ పెద్దగా ప్రజల్లో ధైర్యం నింపాల్సిందిపోయి అధైర్యాన్ని నూరిపోస్తూ రాష్ట్రం పరువు తీస్తున్నారని ధ్వజమెత్తారు. కరీంనగర్‌లో బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు.

రాష్ట్రంలో ప్రభుత్వం నడపలేమనే స్థితిలో కాంగ్రెస్ ఉందని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసే అడ్డగోలు హామీలు ఇచ్చారని.. ఇప్పుడు ఆరు గ్యారంటీలు అమలు చేయలేమని చేతులెత్తేశారని విమర్శించారు. కేంద్రమంత్రులు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని సీఎం చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. ఎన్నికల్లో హామీలిచ్చిన రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ ఇప్పుడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

మొదటి పేజీ తరువాయి

## పన్నెండున్నరేళ్ల క్రితం కన్నీళ్లతో కోర్టు మెట్లు ఎక్కా: సబితా ఇంద్రారెడ్డి



ఈ కబురు,హైదరాబాద్: ఓబుళాపురం మైనింగ్ కేసులో తనను సీబీఐ కోర్టు నిర్దోషిగా ప్రకటించడంపై మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తనను నిర్దోషిగా ప్రకటించిన న్యాయ వ్యవస్థకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కేసు విషయంలో పన్నెండున్నరేళ్ల క్రితం కన్నీళ్లతో కోర్టు మెట్లు ఎక్కానని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు. ఎన్ని అపవాదులు వచ్చినా తన నియోజకవర్గ ప్రజలు మాత్రం తనకు అండగా నిలిచారన్నారు.

ఈ తీర్పు అనంతరం ఆమె కోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ.. "ఏ తప్పూ చేయకపోయినా ఈ కేసులో నన్ను చేర్చడంపై బాధ పడ్డాను. న్యాయ వ్యవస్థ ద్వారా తనకు న్యాయం జరుగుతుందని నమ్మాను. ఈరోజు అదే జరిగింది. కానీ, ఇన్నేళ్లుగా నేను పడిన అవమానాలు, ప్రతిపక్షంలో ఉన్నవారు నన్ను అవినీతిపరురాలినని, జైలుకు పోతానని మాటలు అంటుంటే ఎంతో బాధపడ్డాను. అలా ప్రచారం చేసినా నా జిల్లా ప్రజలు, నియోజకవర్గం ప్రజలు నాపై సంపూర్ణంగా విశ్వాసం ఉంచారు. ఎవరెన్ని మాట్లాడినా నమ్మకుండా నన్ను గెలిపిస్తూ వచ్చారు. ఇన్నేళ్లుగా నాతో పాటు ఉండి ధైర్యం చెప్పిన అందరికీ కృతజ్ఞతలు" అని అన్నారు.

# సరిగా పడని కారు హ్యాండ్ బ్రేక్..



ప్రమాదంలో గాయపడిన ఆనంద్ ను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం




ప్రమాదానికి కారణమైన కారు

**డ్రైవర్ లేకుండా ముందుకు కదిలిన కారు**

**కారు ఢీకొని జీహెచ్ఎంసీ కార్మికుడి మృతి**

ఈకబురు, శేరిలింగంపల్లి : ఓ కారు డ్రైవర్ ఏమరుపాటు నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. హ్యాండ్ బ్రేక్ సరిగా పడకపోవడం గుర్తించకుండా కారు పార్కు చేయడం, డ్రైవర్ లేకుండానే కారు ముందుకు పరుగులు పెట్టడంతో.. కారు ఢీకొని జిహెచ్ఎంసి కార్మికుడు మృతి చెందాడు. రహదారి మధ్యలో ఉన్న చెట్లకు నీళ్లు పడుతున్న జిహెచ్ఎంసి కార్మికుడు ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

మహరాష్ట్ర పరిధిలోని నాందేడ్ కు చెందిన ఆత్రి ఆనంద్ పవార్(46) బతుకు దెరువు కోసం నగరానికి వలస వచ్చాడు. జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ లో కార్మికునిగా పని చేస్తూ రహదారిపై ఉన్న చెట్లకు నీరు పోసే పని చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 4 గంటల సమయంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రోడ్డుపై ఉన్న చెట్లకు నీళ్లు పోసేందుకు వెళ్లాడు. వర్సిటీ రెండో గేట్ వద్ద రోడ్డుపై వాటర్ ట్యాంకర్ ఆపి, మొక్కలకు నీళ్లు పోయడం కోసం మోటార్ స్టార్ట్ చేయాలని పెట్రోల్ పోస్తున్నాడు. కాగా అదే సమయంలో ఈ దారిలో నిస్సాన్ కారు (కెఏ05 ఏండబ్ల్యూ5720)లో ప్రయాణిస్తున్న సాఫ్టువేర్ ఉద్యోగి ఉమాశంకర్ నిసాన్ సన్నీ కారును రోడ్డుపై ఆపి రోడ్డు పక్కన ఉన్న పండ్లు కొనేందుకు వెళ్లాడు. కాగా ఉమా శంకర్ కారు హ్యాండ్ బ్రేక్ సరిగా వేయక పోవడంతో డ్రైవర్ లేకుండానే కారు ముందుకు కదిలింది. రోడ్డు పల్లంగా ఉండడంతో వేగం అందుకున్న కారు నేరుగా వచ్చి రోడ్డుపై చెట్లకు నీళ్లు పోస్తున్న ఆనంద్ ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆనంద్ నడుముకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే స్పందించిన ఉమా శంకర్ 108కు ఫోన్ చేసి ఆనంద్ ను గచ్చిబౌలి కేర్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి తరలించిన కొద్దిసేపటికే ఆనంద్ మృతి చెందాడు. ఈ మేరకు ఆనంద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించిన గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## హైదరాబాద్‌లో 'ఆపరేషన్ అభ్యాస్'.. సైరన్ మోగితే అవన్నీ బంద్!



**హైదరాబాద్ నగర వ్యాప్తంగా బుధవారం (మే 7న) 'ఆపరేషన్ అభ్యాస్' పేరుతో డిఫెన్స్ మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు.**

ఈ కబురు,హైదరాబాద్: నగర వ్యాప్తంగా బుధవారం (మే 7న) 'ఆపరేషన్ అభ్యాస్' పేరుతో డిఫెన్స్ మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా నగరమంతా సైరన్ల మోత మోగనుంది. సైరన్ వినిపించగానే బహిరంగ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి. సాయంత్రం 4.15 గంటలకు నగరంలోని నాలుగు చోట్ల (సికింద్రాబాద్, గోల్కొండ, కంచన్‌బాగ్ డీఆర్‌డీవో, మౌలాలి ఎన్ఎఫ్‌సీలో) మాక్ డ్రిల్ నిర్వహిస్తారు. పోలీసులు, ఫైర్, ఎస్డీఆర్ఎఫ్, వైద్య, రెవెన్యూ, స్థానిక అధికారులు ఆయా ప్రాంతాలకు చేరుకుంటారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలో ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ఈ మాక్ డ్రిల్‌లో 12 సివిల్‌డిఫెన్స్ సర్వీసులు పాల్గొననున్నాయి. సాయంత్రం 4 గంటలకు నాలుగు ప్రాంతాల్లో ఎయిర్ రైడ్ డ్రిల్ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా నగరమంతా సైరన్లు మోగించనున్నారు. అన్ని కూడళ్లలో రెండు నిమిషాల పాటు సైరన్‌లు మోగనున్నాయి. సైరన్ రాగానే ఎలక్ట్రికల్ పరికరాలు, లైట్లు, స్టవ్‌లు ఆపాలని అధికారులు సూచించారు.

# సంధ్య ఎండీ శ్రీధరర్‌రావుపై ఫిర్యాదుల వెల్లువ

**ఈ-కబురు, శేరిలింగంపల్లి : సంధ్యా కన్వెన్షన్, నిర్మాణ సంస్థ ఎండి శ్రీధర్ రావు మీద ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గచ్చిబౌలిలోని సంధ్యా కన్వెన్షన్ సెంటర్ లో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను హైడ్రా మంగళవారం కూల్చివేయడంతో శ్రీధర్ రావు బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు.**

హైడ్రా చర్యలతో ధైర్యాన్ని కూడగట్టుకున్న బాధితులు వివిధ మార్గాల్లో ఫిర్యాదు చేస్తున్నారు. తమ ప్లాట్లను శ్రీధర్ రావు కబ్జా చేశాడని నగరంలో ఉన్నవారే కాకుండా, దేశంలోని వివిధ ప్రాంతాలు, విదేశాల్లో ఉన్నవారు సైతం హైడ్రాకు ఆన్‌లైన్ లో ఫిర్యాదు చేస్తున్నారు. శ్రీధర్ రావు తమను లే ఔట్‌లోకి సైతం రానీయకుండా అడ్డుకున్నాడని, తమ ప్రమేయం లేకుండానే తమ ప్లాట్ల డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లు రాయించుకుని నిర్మాణాలు చేపడుతున్నారని పలువురు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. విదేశాల నుంచి మెయిల్స్‌తో పాటు.. వీడియో రికార్డింగ్ రూపంలో వారు తమ గోడును వెల్లబోసుకుంటున్నారు. హైడ్రా కూల్చివేతలు చేపట్టిన ఎఫ్ సీఐ లే ఔట్ లో తాము కొనుగోలు చేసిన ప్లాట్ లేదని శ్రీధర రావు మనుషులు బెదిరింపులకు పాల్పడడంతో తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని ఢిల్లీ నుంచి ఓ మహిళ ఆన్‌లైన్ లో హైడ్రాకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది. త్వరలో హైదరాబాద్ వచ్చి హైడ్రా కార్యాలయంలో నేరుగా ఫిర్యాదు చేస్తానని సదరు మహిళ హైడ్రా అధికారులకు తెలిపింది. ఇలా అనేక మంది బాధితులు శ్రీధర్‌రావు కబ్జాలపై హైడ్రాకు ఫిర్యాదులు చేస్తున్నారు. హైడ్రా మంగళవారం కూల్చివేతలు చేపట్టిన ఫెర్టిలైజర్స్ కార్పరేషన్ ఉద్యోగుల లే ఔట్ ప్లాట్ల వారే కాకుండా.. రాయదుర్గంలోని సంధ్య టెక్నో పార్కు బాధితుల నుంచి సైతం శ్రీధర్ రావు ఆక్రమణలపై ఫిర్యాదులు చేస్తున్నారు. ఇప్పటికే సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్‌రావుపై వివిధ పోలీస్ స్టేషన్‌లలో చీటింగ్, కబ్జాలపై 30 వరకు కేసులు నమోదు అయ్యాయి. ఎఫ్‌సీఐ లేఔట్ వివాదంపై సైతం శ్రీధర్ రావు మీద పలు కేసులు విచారణలో ఉన్నాయి. కాగా శ్రీధర్ రావుకు ప్రభుత్వంలో ఉన్న పెద్దలు, కొందరు పోలీసు అధికారులు, ప్రభుత్వ అధికారులు అండగా ఉన్నారనే ప్రచారంతో బాధితులు బయటకు వచ్చేందుకు భయపడినట్లు తెలుస్తుంది ప్రస్తుతం శ్రీధర్ రావు అక్రమ నిర్మాణాల మీద హైడ్రా చర్యలు చేపట్టడంతో బాధితులు ధైర్యం తెచ్చుకొని ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు

## ఒక వ్యక్తిని దోషిగా నిలబెట్టేందుకు తెలంగాణను దివాలా రాష్ట్రంగా చూపొద్దు: ఎంపీ ఈటల

**తెలంగాణ ఎన్నడూ పేద రాష్ట్రం కాదని.. నాయకులు వెనుకబడేసిన ప్రాంతమని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.**

ఈ కబురు,హైదరాబాద్: తెలంగాణ ఎన్నడూ పేద రాష్ట్రం కాదని.. నాయకులు వెనుకబడేసిన ప్రాంతమని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే ఈ ప్రాంతంలో రైల్వే, విద్యుత్, టెలిఫోన్ సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. ఒక వ్యక్తిని, ఒక పార్టీని దోషిగా నిలబెట్టేందుకు తెలంగాణను దివాలా రాష్ట్రంగా చూపొద్దన్నారు. సోమవారం ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల నేపథ్యంలో ఈటల ఈ విధంగా స్పందించారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "తెలంగాణ దివాలా తీసిన రాష్ట్రమని సీఎం రేవంత్ పేర్కొనడం సరికాదు. ధాన్యం దిగుబడి, జీఎస్‌డీపీ, వృద్ధిరేటు, అత్యధిక బడ్జెట్‌స్థాయి వంటి అంశాల్లో అగ్రస్థానంలో ఉంది. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని సీఎం ధ్వంసం చేస్తున్నారు. కొత్త రాష్ట్రమే అయినా తడబాటు లేకుండా గొప్పగా పురోగమిస్తున్నామని గతంలోనే చెప్పాను. 2014లోనే తెలంగాణ సొంత పన్నుల ఆదాయం రూ.29వేల కోట్లు. ఏటా రూ.5వేల కోట్ల నుంచి రూ.10వేల కోట్ల ఆదాయం పెరిగేది. 202324లో రూ.1.19లక్షల కోట్ల ఆదాయం రాష్ట్రానికి వచ్చింది. పన్నేతర ఆదాయం కూడా 2014లోనే రూ.6వేల కోట్లు.. 202324లో రూ.20వేల కోట్లు ఉంది. కేంద్రం పంపిణీ చేసే పన్నుల ఆదాయం కూడా క్రమంగా పెరుగుతోంది" అని ఈటల రాజేందర్ వివరించారు.



# మిస్ వరల్డ్ పోటీల ఏర్పాట్లపై మంత్రి జూపల్లి అసహనం



అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి

**గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాట్ల పరిశీలించిన**

**నత్తనడక పనులు - అధికారులపై మంత్రి ఆగ్రహం**

ఈకబురు, శేరిలింగంపల్లి : మిస్ వరల్డ్ పోటీల ప్రారంభోత్సవ సమయం దగ్గర పడుతున్నా, నేటికి పనులు పూర్తి స్థాయిలో జరుగకపోవడంపై తెలంగాణ రాష్ట పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రపంచ స్థాయి ఈవెంట్ కోసం చేపడుతున్న పనుల నిర్లక్ష్యం, అధికారుల తీరుపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గచ్చిబౌలి స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం మంత్రి జూపల్లి కృష్ణారావు ఆయా విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు. మిస్ వరల్డ్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాట్లపై భాషా సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి మామిడి హరికృష్ణను అడిగి తెలుసుకున్నారు. స్వాగత తోరణాలను కార్డు బోర్డులతో కాకుండా తెలంగాణ సాంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా మామిడి, అరటి ఆకులు, పూలతో ఘనంగా తీర్చిదిద్దాలని సూచించారు. షో బోట్ ఈవెంట్స్ వారు ఏర్పాటు చేస్తున్న స్వాగతం ఆర్చ్ లపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణ సాంస్కృతికి సంబంధం లేకుండా ఇష్టం వచ్చినట్లు ఏర్పాట్లు చేయవద్దని, వారేదో చూపిస్తే మీరెందుకు వాటికి ఓకే చెబుతున్నారని మంత్రి అధికారులపై మండిపడ్డారు. తెలంగాణ సంప్రదాయం ఎక్కడా కనిపించడం లేదన్నారు. భరత నాట్యం, కథక్, పేరిణి నృత్యాలు, సన్నాయి మేళం, భజంత్రీలు, తెలంగాణ కలలు, సాంస్కృతి, హ్యాండ్ క్రాఫ్ట్స్, చేర్యాల నకిశీలు, గుస్సాడి నృత్యాలు ఇలా ప్రతి తెలంగాణ సాంప్రదాయం అడుగడుగునా ఉట్టిపడాలని, ప్రపంచ వేదికపై తెలంగాణ వైభవం కనిపించాలని అధికారులకు మంత్రి జూపల్లి సూచించారు. స్వాగత ఆర్చ్ ను మామిడి తోరణాలు, అరిటాకులు, పూలతో ఏర్పాటు చేయాలని, మిగతా ఏర్పాట్లను ఈనెల 10వ తేదీ వరకు పూర్తి చేయాలని సూచించారు. ఏర్పాట్లలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా అందరి చూపు తెలంగాణ వైపు తిరిగి చూసేలా.. అందరూ ఆశ్చర్య పోయేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. అలాగే శ్రీ మణి ద్వీప ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ప్రదర్శించనున్న పేరిణి స్వాగత నృత్యం శిక్షణను మంత్రి తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ మిస్ వరల్డ్ పోటీల ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయని, ఉదయం శంషాబాద్ లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి పలు సలహాలు సూచనలు చేశామన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించామని, పనుల్లో వేగం పెంచాలని సూచించినట్టు తెలిపారు. తెలంగాణ సాంప్రదాయం, సంస్కృతి ఉట్టిపడేలా ఏర్పాట్లు చేస్తున్నామని, అతిథులకు ఎక్కడ ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. 10వ తేదీ వరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని, ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలను సమన్వయం చేస్తూ మిస్ వరల్డ్ పోటీలను ఘనంగా నిర్వహిస్తామని మంత్రి జూపల్లి వెల్లడించారు.



గచ్చిబౌలి స్టేడియంలో కళాకారుల రిహార్సల్స్

## అసలు ఏమిటీ మాక్ డ్రిల్స్.. 1971లో ఎలా జరిగాయి..?



ఆ సమయాల్లో పెద్దగా మాట్లాడటం కూడా చేసేవారు కాదు. ఆర్కే శర్మ అనే రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి తన అనుభవాలు చెబుతూ.. నాడు సైరన్ వినిపించగానే నేలపై పడుకొని.. చెవులు గట్టిగా మూసుకొనేవారమన్నారు.

**యుద్ధం వేళ ప్రతీదీ కీలకమే..**

1971 యుద్ధ సమయంలో తాజ్‌మహల్‌ను కూడా కేమోఫ్లాజ్ వస్త్రంతో కప్పిపెట్టారు. నాడు ఆగ్రాలోని ఖేరియా ఎయిర్ బేస్ కూడా పాక్ లక్ష్యాల్లో ఒకటి. ఆ దేశ విమానాలు డిసెంబర్ 3వ తేదీన అక్కడ బాంబులు జారవిడిచాయి. దీనిలో ఎయిర్ బేస్ స్వల్పంగా దెబ్బతింది. యుద్ధంలో ప్రజల నైతిక స్థైర్యం దెబ్బతీయడం కోసం సాంస్కృతిక చిహ్నమైన తాజ్ మహల్‌పై పాక్ దాడి చేయొచ్చని భావించారు. దీంతో ఆ మర్నాడే దానిని శత్రువు కంటపడకుండా పరిసరాల్లో కలిసిపోయే చేసేందుకు ఒక ఆకు పచ్చటి జూట్ వస్త్రంతో కప్పిపెట్టారంట.. ఇక దాని సమీపంలోని లైట్లు మొత్తాన్ని ఆర్పేశారు. ఇలాంటి జాగ్రత్తలే ఎర్రకోట, కుతుబ్‌మినార్, జైసల్మేర్ కోట వద్ద కూడా తీసుకొన్నారు. 2వ ప్రపంచ యుద్ధ సమయంలో కూడా బ్రిటిష్ వారు జర్మనీ, జపాన్ విమానాలను తప్పుదోవ పట్టించేందుకు వెదురు పరంజాను ఏర్పాటు చేశారు. అసలు వీటిని ఎందుకు నిర్వహిస్తారు..?

ఇప్పటికే ఈ మాక్ డ్రిల్స్‌లో పాల్గొవాలని ఆయా జిల్లా అధికార యంత్రాంగాలు, సివిల్ డిఫెన్స్ వార్డెన్లు, వాలంటీర్లు, హోమ్‌గార్డ్స్, ఎన్‌సీసీ కోర్‌ను, ఎన్ఎస్ఎస్, నెహ్రూయువ కేంద్ర సంఘటన్, కాలేజ్‌లు, స్కూల్ విద్యార్థులకు కేంద్రం పిలుపునిచ్చింది. శత్రు యుద్ధ విమానాలు, క్షిపణులు, డ్రోన్లు దూసుకొస్తున్న వేళ ప్రజల సన్నద్ధత కోసం వీటిని నిర్వహిస్తున్నారు. ఇందులో సైరన్ అత్యంత కీలకమైంది.

గగనతల దాడుల హెచ్చరిక వ్యవస్థల సామర్థ్యాన్ని అంచనావేసేందుకు.

వాయుసేనతో హాట్‌లైన్, రేడియో కమ్యూనికేషన్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు.

కంట్రోల్‌రూమ్‌లు, షాడో కంట్రోల్ రూమ్‌ల పని తీరును పరీక్షించేందుకు.

పౌరులు, విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి, సంక్షోభ సమయంలో పౌరులు ఆత్మరక్షణ చేసుకోవడం కోసం వీటిని నిర్వహిస్తారు.

బ్లాకౌట్ సమయంలో తీసుకోవాల్సిన చర్యలను నేర్పించడం. వాటి ప్రభావాన్ని అంచనావేయడం కోసం.

సివిల్ డిఫెన్స్ సర్వీసులను యాక్టివేట్ చేయడం, వాటి స్పందనను పరీక్షించడం. వీటిల్లో వార్డెన్ సర్వీసులు, అగ్నిమాపక, సహాయక, తరలింపు ఆపరేషన్లు వంటివి ఉంటాయి.

ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించే ప్లాన్ల పని తీరును అంచనావేసుకోవడానికి నిర్వహిస్తారు. ఈ వ్యవస్థలు మొత్తాన్ని యాక్టివేట్ చేస్తారు.

రేపటి డ్రిల్స్‌లో కీలక పరిశ్రమలు, ప్రభుత్వ భవనాలు, సైనిక ఔట్‌పోస్టులను విద్యుత్తు స్టేషన్లు, కమ్యూనికేషన్ హబ్స్ కేమోఫ్లాజ్ చేయడాన్ని కూడా సాధన చేయనున్నారు. ఉపగ్రహాలు, ఇతర గగనతల నిఘా నుంచి తప్పించడానికి ఇలా చేయనున్నారు. ఇలాంటి మాక్ డ్రిల్స్‌ను ఇటీవల కాలంలోకొన్ని దేశాలు నిర్వహించాయి. 2025 మార్చిలో తైవాన్‌లో నిర్వహించారు. ఇక జపాన్‌లో 2023 నవంబర్‌లో జరిగాయి. ఫిన్లాండ్‌లో కూడా రష్యా ఆక్రమణ భయంతో మాక్ డ్రిల్స్ నిర్వహించారు.

# రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సీఎం సూటిగా చెప్పారు



హైదరాబాద్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర వాస్తవ ఆర్థిక పరిస్థితిని ముక్కుసూటిగా చెప్పారని ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సీఎం మాటలను ఆయన ఆవేదనగా భావించాలన్నారు. ఉద్యోగులందరూ సోదరులేనని తమకు వ్యక్తిగతంగా ఎవరితోనూ శత్రుత్వం లేదని చెప్పారు. ఆలస్యమైనా తాము ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తామని స్పష్టం చేశారు. కొందరు ప్రభుత్వాన్ని బెదిరించినట్లు మాట్లాడారని.. అందుకే ముఖ్యమంత్రి అలా మాట్లాడాల్సి వచ్చిందని.. ఆయన వ్యాఖ్యల్లో తప్పేమీ లేదన్నారు. మంగళవారం అసెంబ్లీ ఆవరణలోని సీఎల్పీ కార్యాలయంలో శ్రీధర్‌బాబు విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'గత ప్రభుత్వం తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది. మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని దివాలా తీయించింది. వారు చేసిన రూ.7లక్షల కోట్ల అప్పులకు మా ప్రభుత్వం ప్రతినెలా రూ.6వేల కోట్లు వడ్డీ చెల్లిస్తోంది. గతంలో ఉద్యోగులకు మూడో వారంలో జీతాలు పడేవి. మా ప్రభుత్వం రాగానే ఉద్యోగులకు ఒక డీఏ బకాయి చెల్లించాం. ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నాం. ప్రతిపక్షాలు అసెంబ్లీని రద్దు చేయాలంటున్నాయి.. ఎందుకు రద్దు చేయాలి? పహల్గాం ఉగ్రదాడికి బాధ్యత వహించి కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అధికారం నుంచి తప్పుకోవాలి... కానీ మేం ప్రతి దానిని రాజకీయ కోణంలో చూడదల్చుకోలేదు. మంత్రులు హెలికాప్టర్ వాడితే విమర్శలు చేయడం అర్థరహితం.

**పుప్పాలగూడలో పరిశ్రమలతో 2 లక్షల ఉద్యోగాలు..**

ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ విషయంలో కక్ష సాధింపు లేదు. అధికారులకు కొన్ని నియమ నిబంధనలు ఉంటాయి వాటిని అనుసరించాల్సిందే. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరుగుతోంది. నివేదికలు రాగానే బాధ్యులపై చట్టపరంగా చర్యలుంటాయి. కానీ కక్ష సాధింపు ఉండదు. ప్రపంచ, దేశవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థ కొంత ఇబ్బందిగా ఉంది. అయినా రాష్ట్రాన్ని సుభిక్షంగా పాలిస్తున్నాం. అందాల పోటీలకు, ఉద్యోగుల సమస్యలకు సంబంధం లేదు. ప్రపంచస్థాయి పోటీలు నిర్వహించడం వల్ల రాష్ట్ర ప్రతిష్ఠ పెరుగుతుంది. ఉద్యోగ విరమణ చేసిన వారికి ఇవ్వాల్సిన ప్రయోజనాలు ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. గత సర్కారు హయాంలోని బకాయిలే ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్ర ఆదాయ వనరులను పెంచుకునేందుకు ఉన్న అవకాశాలపై సబ్ కమిటీ పని చేస్తోంది. పరిశ్రమలు తీసుకురావడం, తద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించడమే మా ప్రభుత్వం ఉద్దేశం. పుప్పాలగూడలో ప్రభుత్వం 300 ఎకరాలు గుర్తించింది. కో అని శ్రీధర్‌బాబు చెప్పారు.





# క్షిపణి దాడి..

## మే 8 వరకు విమానాల నిలిపివేత

అంతర్జాతీయ అనిశ్చితుల కారణంగా ఎయిరిండియా ఇజ్రాయెల్‌లోని టెల్ అవివ్ బెన్ గురియన్ అంతర్జాతీయ విమానాశ్రయానికి రాకపోకలు సాగిస్తున్న విమాన సర్వీసులను మే, 8 వరకు నిలిపేస్తున్నట్లు ప్రకటించింది. ఎయిర్‌పోర్ట్ సమీపంలో జరిగిన క్షిపణి దాడి కారణంగా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. దాంతో ఎయిరిండియా ఢిల్లీటెల్ అవీవ్ ఎయిర్‌క్రాఫ్ట్ ఏఐ 139ను ఇటీవల అబుదాబికి మళ్లించినట్లు తెలిపింది. యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణి కారణంగా ఇజ్రాయెల్‌యెమెన్ ఇరు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు నెలకొంటున్నాయి.

**క్షిపణి దాడి**

యెమెన్‌కు చెందిన హౌతీలు హైపర్ సోనిక్ బాలిస్టిక్ క్షిపణితో ఇజ్రాయెల్‌లోని బెన్ గురియన్ ఎయిర్‌పోర్ట్ పరిధిలో దాడికి పాల్పడ్డారు. దాంతో విమానాశ్రయం సమీపంలో టెర్మినల్ 3 పార్కింగ్ ప్రాంతంలో తీవ్ర నష్టం వాటిల్లింది. మే 4న జరిగిన ఈ దాడిలో ఆరుగురికి గాయాలయ్యాయి. బోయింగ్ 787కు చెందిన ఎయిరిండియా విమానం ఏఐ139 ల్యాండ్ అవ్వడానికి గంట ముందు ఈ సంఘటన జరిగింది. ఫ్లైట్‌రాడార్24.కామ్ ఫ్లైట్ ట్రాకింగ్ డేటా ప్రకారం విమానం జోర్డాన్ గగనతలంలో ఉందని, దాడి సమాచారం తెలిసిన వెంటనే దాన్ని అబుదాబికి మళ్లించాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

**ఎయిరిండియా స్పందన**

మే 4న జరిగిన ఈ సంఘటనకు ప్రతిస్పందనగా ఎయిరిండియా మొదట టెల్ అవీవ్‌కు రాకపోకలు సాగిస్తున్న విమానాలను మే 6 వరకు నిలిపివేసింది. అక్కడ కొనసాగుతున్న భద్రతా కారణాల వల్ల విమానాల నిలిపివేతను మే 8 వరకు పొడిగించింది. టెల్ అవీవ్‌కు ఎయిరిండియా వారానికి ఐదు విమానాలను నడుపుతోంది. ప్రయాణీకులు, సిబ్బంది భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్లు సంస్థ తెలిపింది. క్షేత్రస్థాయిలో సంస్థ బృందాలు ప్రభావిత ప్రయాణీలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొంది.





# ఏఐ వినియోగంలో దూసుకెళ్తున్న భారత్: కేపీఎంజీ రిపోర్ట్

టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఏ రంగంలో చూసినా.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హవా కొనసాగుతోంది. అయితే ప్రపంచంలోని ఇతర దేశాల కంటే కూడా ఏఐను ఎక్కువగా ఇండియా నమ్ముతోందని కేపీఎంజీ నివేదికలో వెల్లడించింది. ట్రస్ట్, యాటిట్యూడ్స్, అండ్ యూజ్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్: ఎ గ్లోబల్ స్టడీ 2025పై వెల్లడించిన నివేదిక కోసం 47 దేశాలలోని సుమారు 48,000 మందిని సర్వే చేసింది. ఇందులో సుమారు 76 శాతం భారతీయులు ఏఐను విశ్వసిస్తున్నట్లు తెలిసింది. ఆరోగ్య సంరక్షణ మాత్రమే కాకుండా ఎకానమీ, విద్య, వినోదం వంటి దాదాపు అన్ని పరిశ్రమలలో ఏఐ వినియోగం ఎక్కువగా ఉంది. దీంతో మానవ ప్రమేయం తగ్గుతుందని.. ప్రతికూల ప్రభావాలు ఏర్పడతాయని సుమారు 78 శాతం మంది ఆందోళన వ్యక్తం చేశారు. 97 శాతం మంది భారతీయ ఉద్యోగులు ఉద్దేశపూర్వకంగా తమ పనిలో AIని ఉపయోగిస్తున్నారని, 67 శాతం మంది అది లేకుండా తమ పనులను పూర్తి చేయలేరని పేర్కొన్నారు. భారతదేశంలో ఏఐ వినియోగం పెరిగిపోతుండంతో.. ఏఐబేస్డ్ ఆర్థిక వృద్ధి & ఆవిష్కరణలలో ఇండియా అగ్రగామిగా దూసుకెళ్తోంది. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే, అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఐదుగురిలో ముగ్గురు వ్యక్తులు ఏఐను విశ్వసిస్తారు. అయితే అభివృద్ధి చెందిన దేశాలలో ఐదుగురిలో ఇద్దరు మాత్రమే దీనిని విశ్వసిస్తున్నారు.

# బిగ్ బ్యాటరీతో విండ్‌సోర్ ప్రో.. సింగిల్ ఛార్జ్‌తో 449km



జేఎస్‌డబ్ల్యూ ఎంజీ సంస్థ విండ్‌సోర్‌లో కొత్త వెర్షన్‌ను లాంచ్ చేసింది. దీని ధరను రూ.17.49 లక్షలుగా నిర్ణయించింది.

ప్రముఖ కార్ల తయారీ కంపెనీ జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ తన పాపులర్ విద్యుత్ కారు విండ్‌సోర్‌లో కొత్త వెర్షన్‌ను లాంచ్ చేసింది. మరింత బిగ్ బ్యాటరీతో, అధిక రేంజ్‌తో విండ్‌సోర్ ఈవీ ప్రోను మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ధరను రూ.17.49 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్) నిర్ణయించింది. ఈ ధర తొలి 8 వేల మంది కస్టమర్లకు మాత్రమేనని కంపెనీ పేర్కొంది. మే 8 నుంచి బుకింగ్‌లు ప్రారంభం కానున్నాయి. స్టాండర్డ్ మోడల్‌తో పోలిస్తే అదనంగా కొన్ని ఫీచర్లను కూడా జోడించారు.

**ఆ వివరాలు ఇవీ..**

గతేడాది జేఎస్‌డబ్ల్యూ ఎంజీ తొలి విండ్‌సోర్ ఈవీని లాంచ్ చేసింది. దానికి వాహనదారుల నుంచి మంచి స్పందన రావడంతో ఏడాది తిరగక ముందే ప్రో వెర్షన్‌ను కంపెనీ లాంచ్ చేసింది. స్టాండర్డ్ వేరియంట్‌లో 38 kWh బ్యాటరీ ఇవ్వగా.. ప్రో వేరియంట్‌లో 52.9 kWh బ్యాటరీ ప్యాక్ ఇచ్చారు. స్టాండర్డ్ వేరియంట్ సింగిల్ ఛార్జ్‌తో 332 కిలోమీటర్ల రేంజ్‌తో వస్తుండగా.. ప్రో వెర్షన్ సింగిల్ ఛార్జ్‌తో 449 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది. పవర్‌లో ఎలాంటి మార్పు లేదు. ఇందులోని ఎలక్ట్రిక్ మోటార్ 136 హెచ్‌పీ పవర్‌ను, 200 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది.

లుక్ పరంగా కూడా పెద్దగా ఏ మార్పులు చేయలేదు. అల్లాయ్ వీల్స్‌లో కొత్త డిజైన్ ఇచ్చారు. సెల్‌డాన్ బ్లూ, ఆరా సిల్వర్, గ్లేజ్ రెడ్ రంగుల్లో లభిస్తుంది. ట్రాఫిక్ జామ్ అసిస్ట్, అడాప్టివ్ క్రూజ్ కంట్రోల్ వంటి లెవల్ 2 అడాస్ ఫీచర్లతో విండ్‌సోర్ ప్రో వస్తోంది. గత వెర్షన్‌లో ఇవేవీ లేవు. వెనకవైపు ADAS బ్యాడ్జ్ కూడా జోడించారు. అలాగే, వెహికల్ టు లోడ్ ద్వారా కారు పవర్‌ను ఇతర డివైజులకు అందించొచ్చు. వెహికల్ టు వెహికల్ సదుపాయం ద్వారా ఇతర వాహనాలతో పవర్‌ను పంచుకోవచ్చు. కొత్తగా ఈ రెండు ఫీచర్లను ప్రో వెర్షన్‌కు జోడించారు.

# దక్షిణ భారత్‌లోనే అతిపెద్ద మహీంద్రా డీలర్‌షిప్



భారతదేశంలోని అతిపెద్ద ఆటోమొబైల్ రిటైల్ సంస్థలలో ఒకటైన ఆటోమోటివ్ మానుఫ్యాక్చరర్స్ ప్రైవేట్ లిమిటెడ్ విజయవాడలో.. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద మహీంద్రా డీలర్‌షిప్‌ను ప్రారంభించింది.

విజయవాడలోని ఏలూరు రోడ్డు, ఎనికెపాడులో ఉన్న ఈ కొత్త డీలర్‌షిప్ 1.03 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. 14 వాహనాలను ఒకేసారి ప్రదర్శించగల కెపాసిటీ ఉన్న ఈ షోరూమ్‌లో.. ప్యాసింజర్ వెహికల్ (ఐసీఈ & ఈవీ), స్మాల్ కమర్షియల్ వెహికల్ (ఎస్‌సీవీ), లాస్ట్ మైల్ మొబిలిటీ (ఎల్‌ఎంఎం) వాహనాలన్నీ లభిస్తాయి.

ఈ కొత్త డీలర్‌షిప్ ద్వారా కేవలం సేల్స్ మాత్రమే కాకుండా.. సర్వీస్, వాహనాలకు అవసరమైన ఫాస్ట్‌ఛార్జింగ్ సౌకర్యం కలిగి ఉంటుంది. టెక్నాలజీని ప్రతిబింబించేలా.. ఆకర్షణీయమైన డిజైన్ పొందిన ఈ షోరూమ్ 61 కొత్త సర్వీస్ బేలు కలిగి ఉంది. ఇవి ఏడాదికి 28000 మందికి సేవలను అందించగలవు.

అతిపెద్ద మహీంద్రా డీలర్‌షిప్ ప్రారంభంతో.. ఆటోమోటివ్ మానుఫ్యాక్చరర్స్ ప్రైవేట్ లిమిటెడ్ దేశవ్యాప్తంగా తన విస్తృత నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేసుకుంటోంది. ఈ గ్రూప్ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో 135 మహీంద్రా టచ్‌పాయింట్‌లను నిర్వహిస్తోంది.

FY 2025లో ఈ గ్రూప్ 37,000 మహీంద్రా వాహనాలను విక్రయించింది. అంటే ప్రతి 13 నిమిషాలకు ఒక వాహనం అమ్ముడుపోయిందనమాట. దీంతో భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్నకోసం అతిపెద్ద సేల్స్ అండ్ ఆఫ్టర్‌సేల్స్ భాగస్వామిగా నిలిచింది.



# ఫ్లాట్‌గా ప్రారంభమైన స్టాక్ మార్కెట్ సూచీలు

**దేశీయ మార్కెట్ సూచీలు నేడు ఫ్లాట్‌గా రోజును ప్రారంభించాయి.**

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం ఫ్లాట్‌గా ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లోని మిశ్రమ సంకేతాల నడుమ.. తొలుత లాభాల్లో ప్రారంభమైన సూచీలు, తర్వాత స్వల్ప నష్టాల్లోకి జారుకున్నాయి. ఉదయం 9:30 గంటల సమయంలో సెన్సెక్స్ 67 పాయింట్లు నష్టంతో 80,729 వద్ద ట్రేడవుతుండగా.. నిఫ్టీ 19 పాయింట్ల నష్టంతో 24,442 వద్ద కొనసాగుతోంది.

డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ ఐదు పైసలు తగ్గి, 84.35 వద్ద ఉంది. నిఫ్టీ సూచీలో భారతీ ఎయిర్‌టెల్, కోల్ ఇండియా, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఆటో, బజాజ్ ఎలక్ట్రానిక్స్ షేర్లు లాభాల్లో కదలాడుతున్నాయి. సిప్లా, అదానీ ఎంటర్‌ప్రైజెస్, అపోలో హాస్పిటల్ స్టాక్స్ నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి.

మదుపర్లు లాభాల స్వీకరణ వైపు మొగ్గుచూపడంతో అమ్మకాలు చోటుచేసుకోవడం, మే 67 తేదీల్లో జరిగే అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశాలపై దృష్టి పెట్టడం వంటి అంశాలు మన సూచీలపై ప్రభావం చూపించాయి. నిన్న సెలవుల కారణంగా పనిచేయని ఆసియా మార్కెట్లు.. ఈ రోజు లాభాల్లో ట్రేడింగ్‌ను మొదలుపెట్టాయి. అమెరికా మార్కెట్లు నిన్న నష్టాలతో ముగిశాయి.





## గుడ్ న్యూస్ చెప్పిన వరుణ్ తేజ్ లావణ్యత్రిపాఠి

వరుణ్ తేజ్ - లావణ్యత్రిపాఠి దంపతులు శుభవార్త చెప్పారు. తల్లిదండ్రులు కానున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు.

వరుణ్ తేజ్ - లావణ్యత్రిపాఠి దంపతులు శుభవార్త చెప్పారు. తల్లిదండ్రులు కానున్నట్లు తెలుపుతూ ఓ క్యూట్ ఫొటో పంచుకున్నారు. 'జీవితంలో అత్యంత అందమైన పాత్ర పోషించనున్నాను. కమింగ్ సూన్' అని వరుణ్ తేజ్ క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతుండగా సినీ ప్రముఖులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. సమంత, రకుల్ ప్రీత్ సింగ్, అల్లు స్నేహా కంగ్రాట్స్ అంటూ రిప్లైలు పెట్టారు.

2017లో 'మిస్టర్' సినిమా కోసం వరుణ్ - లావణ్య తొలిసారి కలిసి నటించారు. అప్పుడే ఇద్దరూ మంచి స్నేహితులయ్యారు. ఆ మరుసటి ఏడాది వచ్చిన 'అంతరిక్షం'లోనూ ఈ జంట ప్రేక్షకుల్ని మెప్పించింది. 2023 నవంబర్ 1న ఇటలీలోని టస్కానీ వేదికగా వీరిద్దరూ వివాహబంధంతో ఒక్కటయ్యారు. ఇటీవల లావణ్య త్రిపాఠి 'సతీ లీలావతి' లో నటించారు.



## 6400 కి..మీ.. 36 దేశాలు.. ఎడారులు.. ఇసుక తుపానులు: సిల్క్ రోడ్ కథ చెప్పిన పూరి జగన్నాథ్

**'పూరి మ్యూజింగ్స్'లో భాగంగా పూరి జగన్నాథ్ సిల్క్ రోడ్ గురించి వివరించారు.**

దర్శకుడు పూరి జగన్నాథ్ మరో ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. సిల్క్ రోడ్ గురించి వివరించారు. ఈ రోడ్‌లో ప్రయాణించడం ఎంతో ప్రమాదకరమని ఆ రూట్‌లో వెళ్తే ప్రాణాలతో వస్తారో, లేదో కూడా తెలియదని చెప్పారు. 'పూరి మ్యూజింగ్స్' పేరుతో ఆయన వివిధ అంశాలపై తన అభిప్రాయాన్ని పంచుకుంటున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా తాజాగా సిల్క్ రోడ్ గురించి వివరించారు. ''పూర్వం చైనా నుంచి యూరప్ వరకూ ఒక కనెక్టింగ్ రూట్ ఉండేది. దాని పేరు సిల్క్ రోడ్. అప్పట్లో చైనా సిల్క్‌కు యూరప్‌లో విపరీతమైన డిమాండ్ ఉండేది. సిల్క్ బిజినెస్ కోసం ప్రారంభమైన రూట్ ఇది. 36 దేశాలను కలుపుతూ.. 6,400 కిలోమీటర్లు ఉండేది. చైనా, మంగోలియా, పాకిస్థాన్, ఇరాన్, ఇరాక్, ఈజిప్ట్, కజికిస్థాన్, సిరియా, టర్కీ ఇలా అన్ని దేశాలు కనెక్ట్ అయి ఉంటాయి. అయితే, ఈ రూట్‌లో వెళ్తే ప్రాణాలతో వస్తారో, లేదో ఎవరికీ తెలియదు. అంత ప్రమాదకరంగా ఉంటుంది. ఎందుకంటే ఎన్నో ఎడారులను దాటుకుంటూ వెళ్లాలి. ఇసుక తుపానుల మధ్య ప్రయాణం చేయాలి. పైగా విపరీతమైన ఉష్ణోగ్రతలు ఉండేవి. ఒంటెలు, గుర్రాలు లేకుండా ఎవరూ ప్రయాణం చేయలేరు. చైనా నుంచి టర్కీకి చేరాలంటే ఒక సంవత్సరం పట్టేది''. ''ఈ రోడ్ ద్వారా ఇండియా నుంచి సిల్క్‌తో పాటు మసాల, కుంకుమ, దాల్చిన చెక్క, మిరియాలు ఎగుమతి చేసేవారు. చైనా నుంచి ఏనుగు దంతాలు, రోమ్ నుంచి బంగారం, వెండి ఎగుమతి చేసేవారు. ఇలా రకరకాల బిజినెస్‌లు జరిగేవి. ఈ రోడ్ వల్ల ఇస్లాం, బుద్ధిజం, క్రిస్టియానిటీ అక్కడి నుంచి ఇక్కడికి, ఇక్కడి నుంచి అక్కడికి వచ్చేసేవి. మొదటిసారి చైనా వాళ్లు పేపర్, గన్ పౌడర్ తయారుచేశారు. వాటిని ప్రపంచమంతా కొనాల్సి వచ్చింది. ఆ రూట్ చంఘిజ్ ఖాన్ ఎంపైర్ చేతిలో ఉండేది. వాళ్లే దౌర్జన్యం చేసేవారు. మార్క్ పోలో ఈ రూట్‌ను ఉపయోగించుకుంటూ పేపర్, బొగ్గు అమ్మడం ప్రారంభించారు''. ''ఈ రూట్ మధ్యలో దోపిడీ దొంగలు దాడి చేసేవారు. వాళ్ల నుంచి తప్పించుకోవడానికి అందరూ వెయ్యి ఒంటెలతో ప్రయాణించేవారు. ఈ రూట్‌లో వ్యాపారం చేయాలంటే కత్తి పట్టుకొని బయల్దేరాలి. 1500 సంవత్సరాల పాటు ప్రపంచమంతా ఈ దారినే వాడింది. ఈ రూట్‌లో బిజినెస్ చేయడానికి అందరూ ఒక ప్రత్యేక భాష ఉపయోగించేవారు. దాని పేరు మాలి. ఆ తర్వాత సముద్రమార్గం కనిపెట్టడం వల్ల ఈ సిల్క్ రోడ్డు ప్రయాణాన్ని తగ్గించేశారు. వరల్డ్ గ్లోబలైజేషన్‌కు మొదటి కారణం ఈ సిల్క్ రూటే. సంస్కృతి, టెక్నాలజీ, మతాలు ఇలా ఎన్నో అంశాలు అందరూ ఎక్స్ఛేంజ్ చేసుకునేవారు. ఇప్పటికీ కొంతమంది ట్రావెలర్స్ ఈ సిల్క్ రోడ్‌లో ప్రయాణం చేస్తున్నారు'' అని పూరి వివరించారు.

---

## ఆ వార్తలో నిజం లేదు.. ఇంకెప్పుడూ దాని గురించి మాట్లాడను: సమంత

సమంత నిర్మాతగా వ్యవహరించిన తొలి సినిమా 'శుభం'. శుక్రవారం విడుదల కానున్న ఈ సినిమా గురించి ఆమె పంచుకున్న విశేషాలివీ.. నటిగా తనని తాను నిరూపించుకున్న సమంత.. నిర్మాతగా అదృష్టం పరీక్షించుకోనున్నారు. తన నిర్మాణ సంస్థ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్'లో రూపొందిన తొలి సినిమా 'శుభం' . హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పేరి, శ్రియ కొంతం తదితరులు ప్రధాన పాత్రల్లో దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల తెరకెక్కించారు. ఈ హారర్ కామెడీ మూవీ ఈ నెల 9న బాక్సాఫీసు ముందుకు రానుంది. ఈ సందర్భంగా సమంత.. మీడియాతో ముచ్చటించారు.

ఇకపై వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడకూడదని నిర్ణయించుకున్నట్టు సమంత తెలిపారు. ఓ యువకుడు తనకు గుడి కట్టాడన్న విషయం తెలిసిందన్న ఆమె.. అభిమానుల ప్రేమను స్వీకరిస్తానని, అలాంటి వాటిని ప్రోత్సహించనని పేర్కొన్నారు. అల్లు అర్జున్ అట్లీ కాంబినేషన్ మూవీ గురించి మాట్లాడుతూ.. ''నేను ఆ సినిమాలో నటిస్తున్నానంటూ వచ్చిన వార్తల్లో నిజం లేదు. దర్శకుడు అట్లీ నాకు స్నేహితుడు. భవిష్యత్తులో అవకాశం ఉంటే అతడి చిత్రాల్లో నటిస్తా'' అని అన్నారు.

**సమంత ఊతపదం ఇదే.. ఇష్టమైన ఎమోజీ అదే**

''శుభం' సినిమాని 8 నెలల్లో పూర్తి చేశాం. కొత్త కథలు చెప్పాలి. కొత్త వారికి అవకాశం ఇవ్వాలన్నది 'ట్రాలాలా' ముఖ్య ఉద్దేశం. నటిగా స్టార్‌డమ్ వచ్చినా.. చిత్ర పరిశ్రమ కోసం ఏదో చేయాలనే ఆలోచన వెంటాడేది. అందుకే కాస్త విరామం తీసుకుని.. నిర్మాత కావాలని ఫిక్స్ అయ్యా. నా నిర్మాణ సంస్థలో రూపొందిన తొలి సినిమాలో నేను నటించకూడదని నిర్ణయించుకున్నా. కానీ, అతిథి పాత్ర కోసం ఎవరినీ అడగలేక నేనే నటించా. 'శుభం' టీమ్‌ని చూస్తుంటే నాకు 'ఏమాయ చేసావె' రోజులు గుర్తొచ్చాయి. నటిగా నా తదుపరి సినిమా 'మా ఇంటి బంగారం' త్వరలో ప్రారంభమవుతుంది'' అని తెలిపారు.





## భయపడ్డాను.. పారిపోవాలనిపించింది: 'మెట్ గాలా' అనుభవాన్ని పంచుకున్న షారుక్

తొలిసారి మెట్ గాలాలో పాల్గొన్నారు బాలీవుడ్ హీరో షారుక్ ఖాన్. తాజాగా ఓ ఆంగ్ల మీడియాతో తన అనుభవాన్ని పంచుకున్నారు.

న్యూయార్క్‌లోని మెట్రోపాలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్స్‌లో జరిగిన మెట్ గాలాలో తొలిసారి కనిపించి ప్రపంచం దృష్టిని ఆకర్షించారు బాలీవుడ్ స్టార్ షారుక్ ఖాన్. ఈ వేడుకలకు హాజరైన తొలి భారతీయ నటుడిగా రికార్డు సృష్టించారు. సబ్యసాచి డిజైన్ చేసిన దుస్తుల్లో స్టైలిష్‌గా కనిపించారు. తాజాగా ఆయన మెట్ గాలా అనుభవాన్ని ఓ ఆంగ్ల మీడియాతో పంచుకున్నారు. తాను ఎంతో భయపడినట్లు తెలిపారు. తన పిల్లల కోసమే ఈ వేడుకకు హాజరైనట్లు చెప్పారు. "నేను నా జీవితంలో ఎప్పుడూ ఈవిధంగా భయపడలేదు. ఎప్పుడెప్పుడు ఇక్కడి నుంచి పారిపోవాలా అని ఆలోచించాను. నాకు ఫ్యాషన్‌పై ఆసక్తి తక్కువ. సబ్యసాచి నాకోసం అద్భుతమైన కాస్ట్యూమ్ తయారుచేశారు. ఈ వేడుకకు రావడానికి ప్రధాన కారణం నా పిల్లలు ఆర్యన్, సుహానా. నాకు ఆహ్వానం అందగానే వాళ్లిద్దరూ ఎంతో సంతోషించారు. ఇందులో నేను పాల్గొనడం చరిత్రలో నిలిచిపోతుందని నాకు తెలియదు. వాస్తవానికి ఆహ్వానం అందుకున్నప్పుడు నేను కూడా ఆశ్చర్యపోయాను. నేనెప్పుడూ రెడ్‌కార్పెట్ అనుభవాన్ని పొందలేదు. అందుకే చాలా బిడియంగా అనిపించింది" అని తెలిపారు. ఈ ఏడాది షారుక్‌తో పాటు కియారా అడ్వాణీ, గాయకుడు దిల్జిత్ దోసాంజ్ కూడా తొలిసారి ఈ వేదికపై మెరిశారు.

ఈ వేడుకలో షారుక్ తన ఐకానిక్ పోజ్‌తో అందరినీ ఆకర్షించారు. 'కె' లెటర్ లాకెట్ ఉన్న చైన్‌తో భిన్నమైన లుక్‌లో కనిపించారు. 'నా పేరు షారుక్..' అంటూ తన గురించి అక్కడి వారికి వివరించారు. ప్రస్తుతం ఈ కింగ్ ఖాన్ ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి.



## మెట్ గాలాలో మెరిసిన గేమ్ ఛేంజర్ బ్యూటీ.. తొలి నటిగా గుర్తింపు!

ప్రతిష్ఠాత్మక ఈవెంట్‌లో గేమ్ ఛేంజర్ హీరోయిన్ కియారా అద్వానీ మెరిసింది. న్యూయార్క్‌లోని మెట్రోపాలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్స్‌లో జరిగిన మెట్‌గాలాలో బాలీవుడ్ సినీ తారలంత సందడి చేశారు. ఇందులో బాలీవుడ్ హీరోయిన్ కియారా అద్వానీ స్పెషల్ అట్రాక్షన్ నిలిచింది. తన బేబీ బంప్‌తో వేదికపై ఎంట్రీ ఇచ్చింది. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరలవుతున్నాయి. ప్రముఖ భారతీయ డిజైనర్ గౌరవ్ గుప్తా రూపొందించిన దుస్తులను కియారా ధరించి ఈవెంట్‌లో మెరిసింది.

కాగా..'సూపర్‌ఫైన్: టైలరింగ్ బ్లాక్ స్టైల్' అనే థీమ్‌తో మెట్ గాలా- 2025 ఈవెంట్ నిర్వహిస్తున్నారు. బేబీ బంప్‌తో మెట్ గాలా కార్పెట్‌పై ఎంట్రీ ఇచ్చిన మొదటి భారతీయ నటిగా నిలిచింది. ఈ సందర్భంగా నా జీవితంలో ఒక నటిగా, కాబోయే తల్లిగా మెట్ గాలా అరంగేట్రం చేయడం చాలా ప్రత్యేకమైన అనుభూతిని కలిగిస్తోందని కియారా పేర్కొంది. నా స్టైలిస్ట్ లుక్‌ను డిజైన్ చేయడానికి గౌరవ్ సృష్టించిన డ్రెస్ కోడ్ చాలా అందంగా ఉందని తెలిపింది.

సినిమాల విషయానికొస్తే కియారా అద్వానీ చివరిసారిగా రామ్ చరణ్ సరసన కనిపించింది. శంకర్ డైరెక్షన్‌లో వచ్చిన గేమ్ ఛేంజర్ చిత్రంలో నటించింది. అయితే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద వసూళ్లు రాబట్టడంలో సక్సెస్ కాలేకపోయింది. కాగా.. బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాను పెళ్లాడిన ఈ ముద్దుగుమ్మ కొత్త ఏడాదిలోనే అభిమానులకు గుడ్ న్యూస్ చెప్పింది. త్వరలోనే కియారా దంపతులు తల్లిదండ్రులు కాబోతున్నారు.



## చెత్త ప్రదర్శన చేసిన ఆటగాళ్లతో జట్టు ప్రకటన..

# కెప్టెన్‌గా రిషబ్ పంత్



ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ఘోరంగా విఫలమవుతున్న ఆటగాళ్లతో ఓ జట్టును రూపొందించింది ఐస్‌ల్యాండ్ క్రికెట్. ఈ జట్టుకు సారధిగా రిషబ్ పంత్‌ను ఎంపిక చేసింది. ఈ జట్టుకు ఐపీఎల్ 2025 మోసగాళ్లు, స్కామర్ల జట్టని నామకరణం చేసింది.

ఈ జట్టులో రాహుల్ త్రిపాఠి, రచిన్ రవీంద్ర, ఇషాన్ కిషన్, రిషబ్ పంత్, వెంకటేశ్ అయ్యర్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, లియామ్ లివింగ్‌స్టోన్, దీపక్ హుడా, రవిచంద్రన్ అశ్విన్, మతీష పతిరణ, మహ్మద్ షమీకి చోటు కల్పించింది. పంత్‌ను కెప్టెన్ కమ్ వికెట్ కీపర్‌గా ఎంపిక చేసింది. ఈ జట్టును నిన్న తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది.

ఐస్‌ల్యాండ్ క్రికెట్ ఎంపిక చేసిన ఈ టీమ్‌పై సోషల్‌మీడియాలో విపరీతమైన స్పందన వస్తుంది. నిజంగానే వీరు స్కామర్లు, మోసగాళ్లు అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. కోట్లలో డబ్బు తీసుకుని కనీస వందల విలువ చేసే ప్రదర్శన కూడా చేయలేకపోతున్నారంటూ విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు.

కొందరేమో ఆటగాళ్లు ఎలా ఆడినా ఐస్‌ల్యాండ్ క్రికెట్ ఇలాంటి విమర్శలు చేయకూడదని సలహాలు ఇస్తున్నారు. కాగా, ఐస్‌ల్యాండ్ క్రికెట్‌కు ఇలాంటి వివాదాస్పద పోస్ట్‌లు చేయడం కొత్తేమీ కాదు. క్రికెట్‌కు సంబంధించిన అంశాలపై గతంలో చాలా సందర్భాల్లో వ్యంగ్యంగా స్పందించింది.

ఇదిలా ఉంటే, మోసగాళ్లు.. స్కామర్లు అంటూ ఐస్‌ల్యాండ్ క్రికెట్ ఐపీఎల్ ఆటగాళ్లను విమర్శించడం సరి కాదని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వారి అభిప్రాయాన్ని పక్కన పెడితే, ఐస్‌ల్యాండ్ క్రికెట్ ప్రకటించిన జట్టులోని ఆటగాళ్లుందరూ తీసుకున్న డబ్బుకు న్యాయం చేయలేకపోతున్నారన్నది కాదనలేని సత్యం.

రిషబ్ పంత్, వెంకటేశ్ అయ్యర్ లాంటి ఆటగాళ్లు 20 కోట్లకు పైగా మొత్తాన్ని తీసుకున్నా కనీస ప్రదర్శన చేయలేకపోతున్నారు. మిగతా ఆటగాళ్ల పరిస్థితి కూడా అలాగే ఉంది. మ్యాక్స్‌వెల్, లివింగ్‌స్టోన్ లాంటి విదేశీ ఆటగాళ్లయితే ఏదో హాలిడేకి వచ్చామన్నట్లు ఐపీఎల్‌ను చాలా ఈజీగా తీసుకుంటున్నారు.

ఇషాన్ కిషన్, షమీపై వారి ఫ్రాంచైజీ ఎంతో నమ్మకముంచితే వారు ఆ నమ్మకాన్ని వమ్ము చేశారు. అశ్విన్ అయితే తనకున్న ఘన చరిత్రను చెత్త ప్రదర్శనలతో దిగజార్చుకున్నాడు. రాహుల్ త్రిపాఠి, దీపక్ హుడా లాంటి వారు కోట్లు మింగి గల్లీ క్రికెటర్ల కంటే హీనమైన క్రికెట్‌ను ఆడుతున్నారు.

**రాహుల్ త్రిపాఠి- 3.4 కోట్లు**
**రచిన్ రవీంద్ర- 4 కోట్లు**
**ఇషాన్ కిషన్- 11.25**
**దీపక్ హుడా- 1.7 కోట్లు**
**రిషబ్ పంత్- 27 కోట్లు**
**వెంకటేశ్ అయ్యర్- 23.75**
**గ్లెన్ మ్యాక్స్‌వెల్- 4.2 కోట్లు**
**లియామ్ లివింగ్‌స్టోన్- 8.75 కోట్లు**
**రవిచంద్రన్ అశ్విన్- 9.75 కోట్లు**
**మతీష పతిరణ- 13 కోట్లు**
**మహ్మద్ షమీ- 10 కోట్లు**



## అరంగేట్రం'లోనే అదుర్స్.. చరిత్ర సృష్టించిన ఇషాన్ కిషన్

ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్ సందర్భంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ ఇషాన్ కిషన్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్ చరిత్రలో ఇంత వరకు ఏ వికెట్ కీపర్‌కూ సాధ్యం కాని అరుదైన ఘనత సాధించాడు. కాగా ఐపీఎల్2025 మెగా వేలానికి ముందు ముంబై ఇండియన్స్ ఇషాన్‌ను వదిలివేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ. 11.25 కోట్ల భారీ ధరకు అతడిని కొనుగోలు చేసింది. ఇందుకు తగ్గట్లుగానే ఈ జట్టు తరపున తొలి మ్యాచ్‌లోనే ఇషాన్ ఇరగదీశాడు. వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చి కేవలం 47 బంతుల్లోనే 106 పరుగులతో అజేయంగా నిలిచాడు. తద్వారా రాజస్తాన్ రాయల్స్‌పై సన్‌రైజర్స్ గెలవడంలో కీలక పాత్ర పోషించి.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. కానీ తర్వాత మాత్రం ఇషాన్ కిషన్ వరుసగా విఫలమయ్యాడు. ఒకానొక దశలో తుదిజట్టు నుంచి తప్పించాలన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇలాంటి తరుణంలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో సోమవారం నాటి మ్యాచ్‌లో తొలిసారిగా అతడికి యాజమాన్యం వికెట్ కీపింగ్ బాధ్యతలు అప్పగించింది.

**హెన్రిచ్ క్లాసెన్ స్థానంలో**

హెన్రిచ్ క్లాసెన్‌ను బ్యాటర్‌గా రంగంలోకి దింపి..అతడి స్థానంలో ఇషాన్‌ను తమ జట్టు వికెట్ కీపర్‌గా అరంగేట్రం చేయించింది. ఉప్పల్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన సన్‌రైజర్స్ బౌలింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆదిలోనే షాకుల మీద షాకులు తగిలాయి. ఓపెనర్ కరుణ్ నాయర్‌ను డకౌట్ చేసిన రైజర్స్ సారథి, స్టార్ పేసర్ ప్యాట్ కమిన్స్.. ఆ తర్వాత మరో ఓపెనర్ ఫాఫ్ డుప్లెసిస్ (3) వికెట్ తీశాడు.అనంతరం వన్‌డౌన్ బ్యాటర్ అభిషేక్ పోరెల్ (8)ను కూడా వెనక్కి పంపించాడు. ఈ ముగ్గురూ కమిన్స్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ ఇషాన్ కిషన్‌కు క్యాచ్ ఇచ్చి దాదాపుగా ఒకే రీతిలో అవుటయ్యాడు.టాప్ 4 బ్యాటర్ల వికెట్లలో భాగమైఆ తర్వాత జయదేవ్ ఉనాద్కట్ బౌలింగ్ ఢిల్లీ స్టార్ కేఎల్ రాహుల్ ఇచ్చిన క్యాచ్‌ను కూడా ఇషాన్ ఒడిసిపట్టాడు. తద్వారా ఢిల్లీ ఇన్నింగ్స్‌లో టాప్ 4 బ్యాటర్ల వికెట్లలో భాగమై.. సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్‌లో ఇలా ఓ వికెట్ కీపర్ ప్రత్యర్థి జట్టుకు చెందిన నలుగురు టాప్ బ్యాటర్ల క్యాచ్ అందుకోవడం ఇదే తొలిసారి.ఇక ఓవరాల్‌గా ఐపీఎల్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో నాలుగు లేదా అంతకంటే ఎక్కువ క్యాచ్‌లు అందుకున్న 27వ ఆటగాడిగా ఇషాన్ నిలిచాడు. ఇందులోని వికెట్ కీపర్ల జాబితాలో అతడిది పదమూడో స్థానం కావడం గమనార్హం.

**ప్లే ఆఫ్స్ రేసు నుంచి అవుట్**

మ్యాచ్ విషయానికొస్తే.. టాపార్డర్ విఫలమైన వేళ మిడిలార్డర్‌లో కేఎల్ రాహుల్ (10), కెప్టెన్ అక్షర్ పటేల్ (6) కూడా నిరాశపరిచారు. అయితే ఆరు, ఎనిమిదో స్థానాల్లో వచ్చిన ట్రిస్టన్ స్టబ్స్ (41 నాటౌట్), అశుతోష్ శర్మ (41) రాణించడంతో ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 133 పరుగులు చేసింది. అయితే, ఢిల్లీ ఇన్నింగ్స్ ముగిసిన తర్వాత వర్షం పడింది. అవుట్‌ఫీల్డ్ మొత్తం తడిగా మారడంతో మ్యాచ్ కొనసాగే వీలు లేకపోవడంతో అంపైర్లు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఇరుజట్లకు చెరో పాయింట్ రాగా.. సన్‌రైజర్స్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించింది. మరోవైపు.. ఢిల్లీ ఆశలు మాత్రం ఇంకా సజీవంగానే ఉన్నాయి.



## ఉత్కంఠ పోరులో ముంబయిపై గుజరాత్ విజయం

ఐపీఎల్ 18లో వరుసగా ఆరు విజయాలు సాధించి భీకర ఫామ్‌లో ఉన్న ముంబయి ఇండియన్స్‌ను గుజరాత్ టైటాన్స్ నిలువరించింది. ఆ జట్టుపై 3 వికెట్ల తేడాతో గుజరాత్ గెలుపొందింది.

**ముంబయి:** ఐపీఎల్ 18లో ముంబయి ఇండియన్స్ జైత్రయాత్రకు బ్రేక్ పడింది. ముంబయితో జరిగిన ఉత్కంఠ పోరులో గుజరాత్ 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. వర్షం అంతరాయంతో డక్ వర్త్ లూయిస్ ప్రకారం..గుజరాత్ లక్ష్యాన్ని 19 ఓవర్లలో 147 పరుగులుగా నిర్దేశించారు. దీంతో గుజరాత్ 7 వికెట్లు కోల్పోయి చివరి బంతికి ఛేదించింది. ఈ విజయంతో గుజరాత్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలోకి దూసుకెళ్లింది. తొలుత ముంబయి నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. విల్ జాక్స్ (53) అర్ధశతకంతో మెరిశాడు. గుజరాత్ ఇన్నింగ్స్‌లో శుభ్‌మన్ గిల్ (43: 46 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్స్), రుథర్‌ఫోర్డ్ (28: 15 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), జోస్ బట్లర్ (30: 27 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్స్) రాణించారు. ముంబయి బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్, బుమ్రా, అశ్విని కుమార్ తలో రెండు వికెట్లు తీశారు. గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. మ్యాచ్ లైవ్ అప్‌డేట్స్ మీకోసం.. ఉత్కంఠ పోరులో ముంబయిపై గుజరాత్ విజయం 19 ఓవర్ వేసిన దీపక్ చాహర్ గుజరాత్ లక్ష్యం 6 బంతుల్లో 15 పరుగులు తొలి బంతికి ఫోర్ బాదిన తెవాతియా రెండో బంతికి సింగిల్ మూడో బంతికి సిక్స్ బాదిన కొయిట్జీ నాలుగో బంతికి నోబాల్, సింగిల్ తీసిన బ్యాటర్లు తర్వాతి బంతికి సింగిల్.. దీంతో సమమైన స్కోర్లు ఐదో బంతికి కొయిట్జీ ఔట్ చివరి బంతికి సింగిల్.. గెలిచిన గుజరాత్ 19 ఓవర్లకు కుదించిన మ్యాచ్ వర్షం అంతరాయంతో 19 ఓవర్లకు కుదించిన మ్యాచ్ చివరి ఓవర్లో గుజరాత్ లక్ష్యం 15 పరుగులు

18 ఓవర్లు పూర్తి.. మ్యాచ్‌కు మరోసారి వర్షం అంతరాయం గుజరాత్ ఆరో వికెట్ కోల్పోయింది. అశ్విని కుమార్ వేసిన 18 ఓవర్‌లో రెండో బంతికి రషీద్ ఖాన్ (2) ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. ర్వాత క్రీజులోకి వచ్చిన గెరాల్డ్ కొయెట్జీ (5) చివరి బంతికి ఫోర్ బాదాడు. 18 ఓవర్లకు స్కోరు 132/6. రాహుల్ తెవాతియా (5) పరుగులతో ఉన్నాడు. 18 ఓవర్ల తర్వాత మ్యాచ్‌కు వర్షం మొదలైంది. దీంతో ఆటను నిలిపివేశారు. ఇంతకుముందు కూడా వరుణుడు మ్యాచ్‌కు ఆటంకం కలిగించిన సంగతి తెలిసిందే. డక్‌వర్త్ లూయిస్ ప్రకారం ప్రస్తుతం గుజరాత్ టైటాన్స్ ఐదు పరుగుల వెనుకంజలో ఉంది.

గుజరాత్ ఐదో వికెట్.. షారుక్ ఖాన్ (6) ఔట్ బుమ్రా వేసిన 16.4 ఓవర్‌కు షారుక్ ఖాన్ (6) క్లీన్‌బౌల్డ్ అయ్యాడు.17 ఓవర్లకు స్కోరు 125/5. రషీద్ ఖాన్ (2), రాహుల్ తెవాతియా (3) పరుగులు చేశారు. రూథర్‌ఫోర్డ్ (28) ఔట్.. గుజరాత్ నాలుగో వికెట్ డౌన్ రూథర్‌ఫోర్డ్ (28) ఔటయ్యాడు. ట్రెంట్ బౌల్ట్ వేసిన 15.3 ఓవర్‌కు ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. 16 ఓవర్లకు స్కోరు 118/4. రాహుల్ తెవాతియా (2), షారుక్ ఖాన్ (2) పరుగులతో ఉన్నారు.

తిరిగి ప్రారంభమైన మ్యాచ్.. శుభ్‌మన్ గిల్ (43) ఔట్ వర్షం ఆగిపోవడంతో మ్యాచ్ తిరిగి ప్రారంభమైంది. బుమ్రా వేసిన 15 ఓవర్‌లో ఐదో బంతికి శుభ్‌మన్ గిల్ (43) క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. 15 ఓవర్లకు స్కోరు 113/3. షారుక్ ఖాన్ (0), రూథర్‌ఫోర్డ్ (27) పరుగులతో ఉన్నారు.

**ఆగిన వర్షం.. కాసేపట్లో మ్యాచ్ ప్రారంభం**

వర్షం ఆగిపోయింది. పిచ్‌పై కప్పిన కవర్లను తొలగిస్తున్నారు. 11 గంటల 20 నిమిషాలకు మ్యాచ్ ప్రారంభంకానుంది. 14 ఓవర్లు పూర్తి.. మ్యాచ్‌కు వర్షం అంతరాయం 14 ఓవర్ల ఆట తర్వాత మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగిస్తోంది. 14 ఓవర్లకు గుజరాత్ స్కోరు 107/2. రూథర్‌ఫోర్డ్ (26), గిల్ (38) పరుగులతో ఉన్నారు. డక్‌వర్త్ లూయిస్ ప్రకారం ప్రస్తుతం గుజరాత్ ఎనిమిది పరుగుల ముందంజలో ఉంది. రూథర్‌ఫోర్డ్ దూకుడు.. వరుసగా 4, 4, 6 ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన రూథర్‌ఫోర్డ్ (15) దూకుడుగా ఆడుతున్నాడు. విల్ జాక్స్ వేసిన 13 ఓవర్‌లో చివరి మూడు బంతులకు వరుసగా 4, 4, 6 బాదేశాడు. 13 ఓవర్లకు స్కోరు 94/2. గిల్ (36) పరుగులతో ఉన్నాడు. గుజరాత్ రెండో వికెట్.. బట్లర్ (30) ఔట్ గుజరాత్ రెండో వికెట్ కోల్పోయింది. బట్లర్ (30) ఔటయ్యాడు. అశ్వని కుమార్ వేసిన 11.3 ఓవర్‌కు వికెట్‌కీపర్ రికెల్‌టన్‌కు క్యాచ్ ఇచ్చాడు.అంతకుముందు బంతికే గిల్ ఇచ్చిన క్యాచ్‌ను మిస్ చేసిన తిలక్ వర్మ 12 ఓవర్లకు స్కోరు 79/2. గిల్ (36), రూథర్‌ఫోర్డ్ (1) క్రీజులో ఉన్నారు. నిలకడగా ఆడుతున్న గుజరాత్ బ్యాటర్లు గుజరాత్ బ్యాటర్లు శుభ్‌మన్ గిల్, బట్లర్ నిలకడగా ఆడుతున్నారు. కర్ణ్ శర్మ వేసిన 11 ఓవర్‌లో ఎనిమిది పరుగులు రాబట్టారు. 11 ఓవర్లకు స్కోరు 76/1. గిల్ (35), బట్లర్ (29) పరుగులతో ఉన్నారు.

**10 ఓవర్లు.. గుజరాత్ స్కోరు ఎంతంటే?**

అశ్వని కుమార్ వేసిన 10 ఓవర్‌లో ఐదు సింగిల్స్ వచ్చాయి. 10 ఓవర్లకు స్కోరు 68/1. గిల్ (28), బట్లర్ (28) పరుగులతో ఉన్నారు. 9 ఓవర్లు.. గుజరాత్ స్కోరు 63/1 కర్ణ్ శర్మ తొమ్మిదో ఓవర్ వేసి ఐదు పరుగులు ఇచ్చాడు. 9 ఓవర్లకు స్కోరు 63/1. గిల్ (25), బట్లర్ (26) పరుగులతో ఉన్నారు. ఎనిమిదో ఓవర్.. 18 పరుగులు ఇచ్చిన పాండ్య హార్దిక్ పాండ్య వేసిన ఎనిమిదో ఓవర్‌లో 18 పరుగులు వచ్చాయి.ఇందులో మూడు వైడ్లు, రెండు నో బాల్స్ ఉన్నాయి. బట్లర్ (24) ఫోర్ బాదాడు. శుభ్‌మన్ గిల్ (22) సిక్స్ బాదాడు.8 ఓవర్లకు స్కోరు 58/1. దీపక్ బౌలింగ్.. రెండు ఫోర్లు బాదిన బట్లర్ దీపక్ చాహర్ బౌలింగ్ ప్రారంభించాడు. ఏడో ఓవర్ వేసి 11 పరుగులు ఇచ్చాడు. బట్లర్ (19) రెండు ఫోర్లు బాదాడు. 7 ఓవర్లకు స్కోరు 40/1. గిల్ (14) పరుగులతో ఉన్నాడు.ఆరు ఓవర్లు పూర్తి.. గుజరాత్ స్కోరు 29 1ఆరో ఓవర్ బౌల్ట్ బౌలింగ్‌లో తొలి బంతికి బట్లర్ సిక్స్ మిగిలిన ఐదు బంతులకు రెండే పరుగులు ఇచ్చిన బౌల్ట్ 12 పరుగులతో శుభ్‌మన్ గిల్, 10 పరుగులతో బట్లర్ క్రీజులో ఉన్నారు.



# చరిత్ర సృష్టించిన సూర్య భాయ్

**ముంబై ఇండియన్స్ స్టార్ ఆటగాడు సూర్యకుమార్ యాదవ్ చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరపున అత్యధిక సీజన్లు 500 కంటే ఎక్కువ పరుగులు చేసిన ఆటగాడిగా అవతరించాడు.**

ఈ ఐపీఎల్ సీజన్‌లో కలుపుకుని సూర్య ఇప్పటివరకు మూడు సార్లు (2025 (510*), 2023 (605), 2018 (512)) ఓ సీజన్‌లో 500 ప్లస్ పరుగులు చేశాడు. సూర్య తర్వాత ముంబై ఇండియన్స్ తరపున అత్యధిక సీజన్లు 500 ప్లస్ పరుగులు చేసిన ఘనత సచిన్ టెండూల్కర్ (2010, 2011), క్వింటన్ డికాక్‌కు (2019, 2020) దక్కుతుంది. వీరిద్దరు తలో రెండు సార్లు ఈ ఘనత సాధించారు. ఇవాళ (మే 6) గుజరాత్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో సూర్య ఈ సీజన్‌లో 500 పరుగుల మార్కును తాకాడు. ఈ మ్యాచ్‌లో సూర్య సీజన్ లీడింగ్ రన్ స్కోరర్‌గానూ అవతరించాడు. ఈ మ్యాచ్‌లో 24 బంతుల్లో 5 ఫోర్ల సాయంతో 35 పరుగులు చేసిన సూర్య సాయి కిషోర్ బౌలింగ్‌లో షారుక్ ఖాన్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఈ సీజన్‌లో సూర్య 12 మ్యాచ్‌ల్లో 510 పరుగులు చేసి లీడింగ్ రన్ స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. ఆరెంజ్ క్యాప్ సాధించే క్రమంలో సూర్య విరాట్‌ను (505) అధిగమించాడు.

**ఈ సీజన్‌లో సూర్య చేసిన స్కోర్లు..**

29(26), 48(28), 27*(9), 67(43), 28(26), 40(28), 26(15), 68*(30), 40*(19), 54(28), 48*(23) & 35(24)

**ఈ సీజన్‌లో టాప్-6 లీడింగ్ రన్ స్కోరర్లు.**

**సూర్యకుమార్ యాదవ్-510**
**విరాట్ కోహ్లి- 505**
**సాయి సుదర్శన్- 504**
**యశస్వి జైస్వాల్- 473**
**జోస్ బట్లర్- 470**
**శుభ్‌మన్ గిల్- 465**

మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ముంబైకు ఆది నుంచే కష్టాలు ఎదురయ్యాయి. రెండో బంతికే ఇన్ ఫామ్ బ్యాటర్ రికెల్టన్ (2) ఔటయ్యాడు. నాలుగో ఓవర్‌లో రోహిత్ శర్మ (7) పెవిలియన్‌కు చేరాడు. అనంతరం విల్ జాక్స్ (53), సూర్యకుమార్ యాదవ్ (35) కాసేపు నిలకడగా ఆడినా.. స్వల్ప వ్యవధిలో ఇద్దరూ ఔటయ్యారు. ఆతర్వాత వచ్చిన తిలక్ వర్మ (7), హార్దిక్ పాండ్యా (1), నమన్ ధిర్ (7) ఇలా వచ్చి అలా వెళ్లారు.

16.2 ఓవర్ల తర్వాత ముంబై స్కోర్ 123/7గా ఉంది. కార్బిన్ బాష్ (4), దీపక్ చాహర్ క్రీజ్‌లో ఉన్నారు. పవర్ ప్లేలో గుజరాత్ ఆటగాళ్లు మూడు సునాయాసమైన క్యాచ్‌లు వదిలి పెట్టినా ముంబై ఇండియన్స్ సద్వినియోగం చేసుకోలేకపోయింది. గుజరాత్ బౌలర్లలో సాయికిషోర్ 2, సిరాజ్, అర్షద్ ఖాన్, ప్రసిద్ధ్ కృష్ణ, రషీద్ ఖాన్, గెరాల్డ్ కొయెట్జీ తలో వికెట్ పడగొట్టారు. శుభ్‌మన్ గిల్ మూడు క్యాచ్‌లు పట్టాడు.